
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 9 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డుడజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	24.6


సమాజాన్ని సంస్కరించాలి

సోదరభావాన్ని పెంపొందించాలి

మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

7

కాంగ్రెస్‌లో నైరాశ్యం



- క్యాబినెట్ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు దక్కని చాన్స్
- డిప్యూటీ స్పీకర్ పోస్టూ దక్కనట్లే!
- అసంతృప్తిలో పార్టీ శ్రేణులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందంటే నల్లగొండ కార్యకర్తల శ్రమతోనే అనే మాట నినాదానికే పరిమితమైందే తప్ప ఆ స్థాయిలో ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నేతలకు ప్రాతినిధ్యం దక్కలేదని కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇదిగో, అదిగో అంటూ సాగదేసి ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లా నేతలకు అవకాశం ఇవ్వకపోవడంపై నేతల్లో అసంతృప్తి నెలకొంటే క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం కనిపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

మంత్రివర్గ విస్తరణలో తప్పకుండా అవకాశం దక్కుతుందని భావించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మొండి చేయి చూపింది. రాజగోపాల్‌రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో, అదే విధంగా గడచిన లోకసభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వడం, పలు సందర్భాల్లో కీలక నేతలు ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించడంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం తప్పకుండా వస్తుందని భావించినప్పటికీ చివరికి చాన్స్ దక్కలేదు. జిల్లాలు, సామాజికవర్గాలతో సంబంధం లేకుండా సమర్థతకు అవకాశం ఇవ్వాలని రాజగోపాల్‌రెడ్డి ఇటీవల తన వాదనను తెరమీదకు తెచ్చారు. అయినా అధిష్ఠానం ఆయన వాదనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒకే జిల్లా, ఒకే కుటుంబం, రెడ్డి సామాజికవర్గ సమీకరణలే చివరికి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కకుండా చేశాయని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

బాలూనాయక్‌కు దూరమైన క్యాబినెట్ కల

ఎమ్మెల్యేగా రెండో పర్యాయం గెలవడం, అంతకు ముందు జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం, ఎస్టీల్లో లంబాడా సామాజికవర్గానికి క్యాబినెట్లో ప్రాతినిధ్యం లేకపోవడం వంటి సమీకరణలతో పాటు సీనియర్ నేతల ఆశీసులతో బాలునాయక్‌కు ఈ దఫా మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. ఏదైనా కారణాలతో అది దూరమైనా క్యాబినెట్ హోదాతో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాయమని భావించినప్పటికీ అధిష్ఠానం ఈ సమీకరణ లేవీ పరిగణనలోకి తీసుకోలేదు. మంత్రివర్గంలో లంబాడా సామాజికవర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలనే అంశానికి ప్రాధాన్యం ఇవ్వకపోగా, డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ రామచందర్ నాయక్‌కు ఇస్తున్నట్లు ప్రకటించడంతో బాలూనాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి కూడా దూరమైంది. ఉమ్మడి జిల్లాకి చెందిన ఎస్సీ, ఎస్టీ కీలక నేతలకు ఇటీవల ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వడంతో పాటు, లంబాడా సామాజికవర్గం ఎక్కువగా కేంద్రీకృతమైన మహబూబాబాద్ జిల్లాకు అవకాశం ఇవ్వాలనే సమీకరణ బాలూనాయక్‌కు పదవినిదూరం చేసిందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వెల్లడవుతోంది. మొత్తంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన ఉమ్మడి జిల్లాకు క్యాబినెట్‌లో, తత్సమాన పదవుల్లో అవకాశం దక్కకపోవడంతో జిల్లాను విస్మరించినట్లేననే భావన క్యాడర్‌లో వ్యక్తమవుతోంది.



అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు

మెనూలోనూ మార్పులు

భువనగిరిటౌన్,జూన్ 7(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆరేళ్లలోపు ప్రీ ప్రైమరీ విద్య, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, వారి ఆరోగ్యంపై సకల జాగ్రత్తలు తీసుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రాలు సామాజిక సేవా కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ నడుం బిగించింది. ఇటీవల అంగన్‌వాడీటీచర్ల, ఆయాల ఉద్యోగ విరమణ వయోపరిమితి 60నుంచి 65 ఏళ్లకు పెంచడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రెట్టింపు చేసింది. అంతేగాక అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా కొత్తరూపం ఇచ్చేందుకు నిర్ణయించింది.దీంతో వసతులు, టీచర్లకు 5జీ ఫోన్లు, కొత్త మెనూ,తదితర కొత్తహంగులు సమకూరనున్నాయి.

సకల వసతులు...

అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మెరుగుపరచడం, నూతన హంగులు కల్పించడం తదితర అంశాలతో ఇటీవల హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ రెండు రోజులపాటు మేధోమదన సదస్సు నిర్వహించింది. మంత్రి సీతక్క, ఆ శాఖ ఉన్నతాధికారులతో పాటు అన్ని జిల్లాల సంక్షేమ అధికారులు, ఎంపిక చేసిన సీడీపీవోలు, తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 57 రకాల విద్య, వినోద సామగ్రి అందించేందుకు ఈ సదస్సులో నిర్ణయం తీసుకున్నారు. అంగన్‌వాడీల్లో ప్రవేశాలు, అవగాహన కోసం కేంద్రాల వారీగా అమ్మ అంగన్‌వాడీ బాట, అంగన్‌వాడీతో సెల్ఫీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం, తాజాగా అన్ని కేంద్రాలకు ఫర్నిచర్‌ను అందించనున్నది. పౌష్టికాహారం కోసం వస్తున్న గర్భిణులు, బాలింతలు నేలపై కూర్చునేందుకు ఇబ్బందులకు గురువుతున్న నేపథ్యంలో కూర్చునేందుకు...

- మిగతా 7వ పేజీలో...

చౌకధరల దుకాణాల ద్వారా నిరుపేదలకు మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ ప్రక్రియలో ఆరు రోజుల పాటు పలు సమస్యలు ఎదురయ్యాయి. సన్నబియ్యం కావడంతో ప్రతి ఒక్కరూ బియ్యం తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో మూడు నెలలకు సంబంధించి ఒకే సారి బియ్యం ఇస్తుండటంతో తెల్ల రేషన్‌కార్డుదారులు చౌకధరల దుకాణాల వద్ద బారులుతీరుతున్నారు. అయితే సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



తొలగుతున్న అడ్డంకులు

- రేషన్ పంపిణీకి కొత్త సాఫ్ట్‌వేర్ ఏర్పాటు
- రెండు రోజుల నుంచి కొంత వెసులుబాటు
- మూడు సార్లు బయోమెట్రిక్‌తో బియ్యం పంపిణీ
- ఈనెలాఖరు వరకు బియ్యం పంపిణీకి చర్యలు
- కొత్త రేషన్ కార్డుల జారీలో ఇంకా గందరగోళమే

తెల్ల రేషన్‌కార్డుదారులకు గతంలో ప్రతీ నెల 15 రోజులు మాత్రమే బియ్యం పంపిణీచేసేవారు. ప్రస్తుతం మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీచేస్తుండటంతో బయోమెట్రిక్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీతో ఈనెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈవిషయం కార్డుదారులకు తెలియక షాపుల వద్ద పడిగాపులుకాస్తున్నారు.డీలర్లు సైతం ఈనెల 30 వరకు బియ్యం పంపిణీ జరుగుతుందని లబ్ధిదారులకు వివరిస్తుండటంతో వారిపై ఒత్తిడి తగ్గింది. అదేవిధంగా పౌరసరఫరాలశాఖ సైతం నెలరోజులపాటు బియ్యం పంపిణీ ఉంటుందని, ఎలాంటి అపోహలకు గురికావొద్దని ప్రచారం చేయడంతో సమస్య తగ్గుముఖం పట్టింది.గతఆరు రోజులవరకు ఒక్కకార్డుదారుడు ఆరుసార్లు బయోమెట్రిక్‌కు సంబంధించి వేలిముద్ర వేయాల్సి ఉండగా,సాఫ్ట్‌వేర్ మార్చడంతో ప్రస్తుతం మూడుసార్ల బయోమెట్రిక్‌తోనే బియ్యం పంపిణీ చేస్తున్నారు.దీంతో 50శాతం మేర సమస్యలు తగ్గాయి.

పాత సాఫ్ట్‌వేర్‌తో పలు సమస్యలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గత ఆరు రోజులుగా రేషన్ బియ్యం పంపిణీలో బయోమెట్రిక్ విధానం సమస్యగా మారింది. గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్‌ను యథావిధిగా అమలు చేసే ప్రయత్నం బెడిసికొట్టింది. దీంతో రెండు రోజుల క్రితం సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో శని, ఆదివారాల్లో ఈ సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నారు. ఒక్కో వ్యక్తి ఆరు కిలోల బియ్యం పంపిణీచేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే పంపిణీ ప్రారంభమైనప్పటికీ బయోమెట్రిక్ విధానం సమస్యగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం కిలో బియ్యం ఇస్తున్న నేపథ్యంలో పలుమార్లు వేలిముద్రలు నమోదుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీం తో సర్వర్ బీజీగా మారింది. ఫలితంగా ఒక్కో వినియోగదారుడు 20నిమిషాల నుంచి గంటల పాటు రేషన్ దుకాణం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాక ఒక సంచిలో బియ్యం ఎక్కువగా మ రో సంచిలో బియ్యం తక్కువగా వస్తున్నట్లు లబ్ధిదారు లు చెబుతున్నారు. గతంలో నెలకు సంబంధించిన రేషన్ పంపిణీపై సమాచారం ఉండగా, ప్రస్తుతం మూడు నెలలకు బియ్యం పంపిణీ కావడంతో డీలర్లకు కొంత అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీ బియ్యాన్ని అందిస్తున్న క్రమంలో మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తుండటంతో ఏర్పడిన సమస్యలు కొంత మేర తగ్గడంతో లబ్ధిదారులకు కొంత ఊరట కలిగింది.గతంలో ఒక్కో వినియోగదారుడు..

- మిగతా 7వ పేజీలో...

సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో సమస్యలు తగ్గాయి

సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో సమస్యలన్నీ తగ్గుముఖం పట్టాయి. తొలుత సమస్యలు ఏర్పడ్డాయి. మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీతో గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్ వల్ల ఇబ్బందులు వచ్చాయి. ప్రస్తుతం ఆ సమస్యలన్నీ సమసిపోయాయి. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ నిరంతరం సాగుతోంది. ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేస్తాం. రేషన్‌కార్డుదారులు ఎలాంటి అపోహలకు గురి కావొద్దు. ఇంకా సమయం ఉన్నందున ప్రతి ఒక్కరూ మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని పొందవచ్చు.

- వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో 54లక్షల మెట్రిక్ టన్నులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు నెలలకు సంబంధించి 54లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్న బియ్యాన్ని లబ్ధిదారుల కు పంపిణీ చేయాల్సింది. ఈ నెలాఖరు వరకు బియ్యం పంపి ణీ జరగనుండటంతో ప్రతీ ఒక్కరికి బియ్యం అందే అవకాశాలు ఉన్నా యి. నల్లగొండ జిల్లాలో 4.84లక్షల రేషన్‌కార్డుదారులకు మూడు నెలల కాలానికి 26.660లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.యాదాద్రి జిల్లాలో 2,18,963 రేషన్‌కార్డుదారులకు 13.51లక్షల మెట్రిక్ టన్నుల బి య్యం, సూర్యాపేట జిల్లాలో 3,24,624మంది కార్డుదారులకు 15.317లక్షల మెట్రిక్ టన్నులకు పైగా బి య్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. బియ్యం పంపిణీకి ఆరు రోజుల పాటు ఆరుసార్లు వేలిముద్రలు వేయా ల్సి రాగా, ప్రస్తుతం మూడు సార్లు మాత్రమే వేలిముద్రలు తీసుకుంటుండటంతో బియ్యం పంపిణీలో జాప్యం కొంత మేర తగ్గింది.

సనాతన ధర్మానికి కాషాయ జెండా అండ

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

రామగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో కాషాయ జెండా ఉన్నంత వరకు సనాతన ధర్మానికి ఎలాంటి ప్రమాదం లేరని ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవం, హిందు సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండలో బీజేపీ, విశ్వ హిందు పరిషత్, బజరంగ్‌దళ్, హిందు దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. రామాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర బీజేపీ కార్యాలయం, గడియారం సెంటర్ మీదుగా శివాజీనగర్‌లోని ఛత్రపతి శివాజీ విగ్రహం వరకు సాగింది. శోభాయాత్రను రాకేష్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ, హిందు దేశంలో హిందువులు ఐక్యతగా ఉండాలన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు హిందువుల మధ్య కులాల పేరుతో చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారని, అటువంటి కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కులాలను గడపలోపు వరకే ఉంచాలని, గడప దాటితే హిందువులుగా ఉండాలన్నారు. హిందువులు ఐక్యతగా ఉంటేనే ధర్మం ఉంటుందని, ధర్మం ఉంటేనే దేశం ఉంటుందని, ఇవి లేని చోట హిందువులు రెక్కలు విరిగిన పక్షుల్లా మారే అవకాశం ఉందన్నారు. హిందు దేశంలో వేలాది సంవత్సరాల క్రితం నుంచే సనాతన ధర్మం ఉందన్నారు. అయితే విదేశీ కుట్రదారులు దేశం మీద పడి దొంగల్లా దోచుకోవడంతో పాటు సనాతన ధర్మాన్ని దెబ్బతీయాలని ప్రయత్నం చేశారన్నారు. హిందు ధర్మాన్ని కాపాడగలిగేవారినే ఎన్నికల్లో గెలిపించుకోవాలని సూచించారు. కొన్ని మతాల వారు వేల కోట్లు ఇచ్చిన కూడా వారి మతానికే ప్రాముఖ్యం ఇస్తున్నారని విమర్శించారు. ఓరుగంటి వంశీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, విశ్వహిందు పరిషత్, బజరంగదళ్, దేవాలయాల పరిరక్షణ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మృగశిర కార్తె సందడి



మృగశిర కార్తె సందర్భంగా నల్లగొండ పానగల్ బైపాస్ సమీపంలో చేపలు కొనుగోలుచేస్తున్న ప్రజలు

65వ నెంబరు జాతీయ రహదారిపై రద్దీ



కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో బారులు తీరిన వాహనాలు

కేతేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం వారాంతపు రద్దీ నెలకొంది. ఏపీ, తెలంగాణలను కలిపే ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పండుగలు, వారాంతంలో రద్దీ మరింత అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో బక్రీద్, మృగశిరకార్తె నేపథ్యంలో శని, ఆదివారాలు సెలవులు రావడంతో హైదరాబాద్, విజయవాడలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే వారు విద్యార్థులు వారి స్వగ్రామాలకు శుక్రవారం వెళ్లారు. సెలవులు ముగిసి సోమవారం విధుల్లో చేరాల్సి ఉండడంతో వారంతా తిరుగు పయనమయ్యారు. వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో స్వగ్రామాలకు వెళ్లిన వారంతా ఆదివారం సాయంత్రం తిరిగి ఏపీ, తెలంగాణకు బయల్దేరారు. దీంతో మధ్యాహ్నం వేళ ఖాళీగా ఉన్న హైవే ఆదివారం సాయంత్రం నుంచి ఇరువైపులా వెళ్లే వాహనాలతో రద్దీగా మారింది. విజయవాడ వైపుకు వెళ్లే వాహనాలు కాస్త తక్కువ సంఖ్యలో ఉన్నా, హైదరాబాద్ లేన్‌లో వెళ్లే వాహనాలు మాత్రం బారులుతీరాయి. దీంతో కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు అర కిలోమీటరు మేర బారులు తీరాయి. టోల్‌కౌంటర్ల వద్ద టోల్ వసూలులో ఆలస్యం జరుగుతుండడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. టోల్‌ప్లాజాలో మొత్తం 12 కౌంటర్లలో ఇరువైపులా ఆరేసి కౌంటర్ల ద్వారా టోల్ వసూలు చేశారు. హైవేపై వాహనాల రద్దీ నేపథ్యంలో హైవే వెంట గ్రామాల్లో బాటసారులు, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే ట్రాక్టర్లు, గొర్రెలు, మేకల మందలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

యారాల ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండ,జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత డీఈ యారాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కోచ్ ప్రకాశ్‌నారాయణ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడాకారులకు రూ.10వేల విలువైన పోషకాహారాన్ని బండారు రమేష్ అందజేశారు. కార్యక్ర మంలో జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, డాక్టర్ సీహెచ్ నరేంద్ర, లక్ష్మణ్, నాగరాజు, ప్రేమ్‌కుమార్, శివ, వెంకట్, శ్రీను, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులు

ప్రభుత్వాన్ని ప్రశ్నించేది కమ్యూనిస్టులే

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సూర్యాపేటఅర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం ప్రభుత్వాలను ప్రశ్నించేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన సీపీఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కమ్యూనిస్టులను లేకుండా చేయాల నే చర్యలు బహిరంగ రహస్యమని, తమ మొద టి శత్రువు ముస్లింలు, రెండో శత్రువు క్రైస్తవులు, మూడవ శత్రువు కమ్యూనిస్టులు అంటూ బీజేపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మావోయిస్టులను లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలో శాంతి భద్రతలు కాపాడకుండా విచక్ష ణా రహితంగా కాల్పులు జరుపుతూ నరమేధాన్ని సృష్టిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ప్రత్యేక వ్యూహం లేదని, కమ్యూనిస్టులతోపాటు మేధావులు, విద్యావంతుల సలహాలు తీసుకొని ప్రభుత్వం ముందుకుపోతే మంచి పాలన అందించవచ్చునన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా పథకాలు అమలుచేయాలన్నారు.

నమో నారసింహ

● భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ ● వైభవంగా స్వాతి వేడుకలు ● ప్రదక్షిణ ప్రారంభించిన ప్రభుత్వ విప్ దంపతులు ● కాలినడకన కొండెక్కిన భక్తులు

యాదగిరిగుట్ట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో స్వాతి వేడుకలు.. గిరిప్రదక్షిణపర్వాలు ఆదివారం రద్దీతో వైభవంగా కొనసాగాయి. ఏకశిఖరం ప్రదక్షిణతోపాటు స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా తొలుత ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. తెల్లవారుజామున గిరిప్రదక్షిణ మహోత్సవంలో స్వామివారిని స్తుతిస్తూ ప్రత్యేక వేషధారణలో కళాకారుల శాస్త్రీయ నృత్యాలు, భజనలు, కీర్తనలతో హోరెత్తించారు. వేడుకల్లో అధిక సంఖ్యలో గిరిప్రదిణ చేసిన భక్తులు కాలినడకన కొండెక్కి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాదిగా వాహనాలపై తరలివచ్చిన భక్తజనంతో వైకుంఠద్వారం కూడలి కిక్కిరిసిపోయింది. ప్రతీనెల స్వాతి నక్షత్రం రోజున జరిగే ప్రదక్షిణలో స్వామివారి నామస్మరణతో దారి పొడవున బారులుతీరారు. యాదగిరిగుట్ట ఏసీపీ పి.శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ సారథ్యంలో భక్తుల రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు భారీకేడ్లతో బందోబస్తు నిర్వహించారు.

ప్రదక్షిణ ప్రారంభించిన విప్ ఐలయ్య

వేకువజామున 3గంటల నుంచే భక్తులు ప్రదక్షిణలో పాల్గొనగా తెల్లవారుజామున 5.30గంటలకు అర్చకులు వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాల నడుమ దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావుతో కలిసి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దంపతులు హారతి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయజయధ్వానాల నడుమ ప్రదక్షిణను ప్రారంభించగా కళాకారుల శాస్త్రీయ నృత్యాలు, భజనలు, కీర్తనలతో గిరిప్రదక్షిణ చేపట్టారు. గిరిప్రదక్షిణకు తరలివచ్చిన భక్తులతో వైకుంఠద్వారం నాలుగు వైపులు వాహనాలతో నిండిపోగా దారులు జనసందోహంగా మారాయి. కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్లు 45 నిమిషాల్లో ప్రదక్షిణ చేసిన భక్తులు మధ్యాహ్నం (ఆరగింపు సమయం) 12గంటల వరకు సుమారు 25వేల మంది భక్తులు పూర్తి చేసుకున్నారు.



ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న విప్ అయిలయ్య

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు



ఆలయంలో స్వామివారి స్వాతి నక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థానపరంగా ఆరాధనల అనంతరం ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 108 కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, అలంకారమూర్తులను అభిషేకించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి 108 సువర్ణ పుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామి వారి జన్మ నక్షత్రం సందర్భంగా దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

వైకుంఠద్వారం చెంత నాలుగు వైపుల వాహనాల పార్కింగ్‌తో భక్తులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

చివరి ఆదివారం కావడంతో..

కాగా, వేసవి సెలవులు చివరి ఆదివారం ముగింపు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. రూ.500 రుసుం చెల్లించి కొండపైకి చేరుకున్న వాహనాలతో బస్టాండ్ ప్రాంగణం పూర్తిగా నిండిపోయి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ఆదివారం ఒక రోజే 1,733 వాహనాలు కొండపైకి రాగా రూ.8,66,500 ఆదాయం సమకూరింది.

శనివారం రాత్రి నుంచే యాదగిరిగుట్టకు చేరుకున్న భక్తులలో ఉభయ క్యూలైన్లల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. ఉదయం సాయంత్రం బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం ఆరగింపు సమయం కలిపి 3 గంటలు ప్రత్యేక దర్శనం, ధర్మదర్శనం భక్తులు క్యూలైన్లల్లోనే వేచి ఉన్నారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు ఉదయం 9 గంటలకే దర్శనం ముగిసిన వాహనదారులు కొండదిగిపోవాలని మైక్ ద్వారా అనౌన్స్ చేశారు. కొండకింద అన్నదాన సత్రం, లక్ష్మీపుష్కరిణి, బస్టాండ్ ప్రాంగణంతో పాటు ఆధ్యాత్మిక వాడలు, కొండపైన ప్రధానాలయం, ప్రాకార మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలలు, శివాలయం, తూర్పు రాజగోపురం చేరుకునే ర్యాంపు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తజనసంద్రం

● కొనసాగిన భక్తుల రద్దీ ● నిత్యాదాయం రూ. 85.57 లక్షలు

యాదగిరిగుట్ట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రం భక్తజన సందోహంగా మారింది. వేసవి సెలవులు చివరి ఆదివారం వారాంతపు సెలవు కావడంతో శనివారం రద్దీ కొనసాగింది. ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. టోల్‌గేట్ (మూడో ఘాట్ రోడ్డు) వద్ద వాహనాలు బారులుతీరాయి. కొండపైన వీఐపీ, బస్టాండ్ ప్రాంగణం పూర్తిగా వాహనాలతో నిండిపోయింది. భక్తులు అటు ఇటు వెళ్లేందుకు అవకాశం లేక ఇబ్బందులుపడ్డారు. బస్టాండ్ ప్లాట్‌ఫాంల్లోనే వాహనాలు, ద్విచక్రవాహనాలు నిలపడంతో బస్సులు ఎక్కేందుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కొండకింద ప్రధాన పార్కింగ్ కూడలి, మూడో ఘాట్ రోడ్డు కూడలి వద్ద చలువ పందిళ్లు ఉన్నప్పటికీ అక్కడ ఎండ నుంచి రక్షణ కరువయ్యింది. శనివారం రాత్రి నుంచే అధిక సంఖ్యలో భక్తులు వాహనాలపై క్షేత్ర సందర్శనకు రాగా కొండపైన, కింద ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాతసేవతో స్వామి అమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవారలకు నిత్యపూజలు ఘనంగా చేపట్టారు. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.



కొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ

గంగమ్మకు ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మండల పరిధిలోని వేపలసింగారంలోని మిట్టగూడెంలో ఆదివారం గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి గంగమ్మతల్లికి పూజలుచేశారు. రైతులు ప్రభలు కట్టి ఊరేగించారు. మహిళా భక్తులు గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. యాదవ భక్తులు గంపలతో గ్రామంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నాగరాజు, లింగయ్య, శ్రీనివాస్, నరసింహ, నరసింహారావు, అచ్చయ్య, వీరబాబు, వెంకటేశ్వర్లు, శివ పాల్గొన్నారు.

ఘనంగా ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేటఅర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట చివ్వెంల మండల పరిధిలోని ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరూట్ల రవికుమారాచార్యులు మాట్లాడుతూ శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారికి స్వాతి నక్షత్రం పురస్కరించుకొని కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. వేకువ జామున ప్రత్యేక అబిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ నిర్వహించారు. ఈసందర్బంగ భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల జాతర

నల్లగొండ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని హైదరాబాద్‌రోడ్‌లోగల రేణుకాఎల్లమ్మ దేవాలయం బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో బోనాల జాతర వైభవంగా జరిగింది. మర్రిగూడ, చుట్టుపక్కల కాలనీలకు చెందిన ప్రజలు పెద్దఎత్తున బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. బోనాలను ఒకేసారి ఊరేగింపుగా తీసుకురావటంతో దారిపొడవునా బారులు తీరాయి. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కీర్తిస్తూ వేపమండలతో నృత్యాలు చేస్తూ బోనాల ఊరేగింపు సాగింది. బోనాలు తెచ్చి నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి పూజించారు. భక్తులు కోళ్లు, మేకలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకులపై

అగ్నిమాపక కానిస్టేబుల్ వీరంగం

● కొట్టు కట్టేశాక బీరు అడిగితే ఇవ్వలేదని...

● పోలీసులకు బాధితుల ఫిర్యాదు... కేసు నమోదు

మోత్కూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బెల్టుషాపు నిర్వాహకులు శనివారం రాత్రి కొట్టు కట్టేశారు. అదే అగ్నిమాపక కానిస్టేబుల్ వెళ్లి బీరు అడిగితే ఇవ్వకపోవడంతో బెల్టుషాపు నిర్వాహకురాలిపై దాడి చేశాడు. గొడవ వద్దని సముదాయించడానికి వెళ్లిన నిర్వాహకురాలి మేనమామ గూబగుయ్యిమనిపించిన సంఘటన శనివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అనాజిపురం గ్రామంలో ఇరుకుల సంతోషలక్ష్మీ, ఆమె భర్త సంతోష్ కిరాణం నడుపుతారు. ఆ దుకాణంలోనే మద్యం కూడా విక్రయిస్తారు. వారు రోజు రాత్రి 9 గంటలకు దుకాణం మూసేస్తారు. ఆ తర్వాత ఏ సరకులు విక్రయించరు. శనివారం రాత్రి 10.30 గంటలకు అదే గ్రామానికి చెందిన అగ్నిమాపక కానిస్టేబుల్ మలిపెద్ది మహేందర్‌రెడ్డి సంతోషలక్ష్మీకి ఫోన్ చేశాడు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో దుకాణం వద్దకు వెళ్లి పిలిచాడు. వారు తలుపులు తీయకపోవడంతో తలుపులు తన్నడం మొదలెట్టాడు. సంతోష్ తలుపు తీయగా మహేందర్‌రెడ్డి బీర్లు కావాలని అడిగాడు. ఈ రాత్రి బీర్లు ఇవ్వమని చెప్పడంతో అతనిపై చేయి చేసుకున్నాడు. అతని భార్య సంతోషలక్ష్మీ బయటకు రాగా ఆమెపై దాడి చేశాడు. ఆమె సమీపంలోనే ఉన్న అతని మేనమామ మారెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫోన్ చేయగా అతను వచ్చి రాత్రి గొడవెందుకు అని సముదాయించే ప్రయత్నం చేయగా నీవేంది మాట్లాడేదని అతని గూబగుయ్యిమనిపించాడు, భాస్కర్‌రెడ్డి చెవిలోంచి రక్త స్రావమైంది. బాధితురాలు 100 ఫోన్ చేయగా పోలీసులు వచ్చారు. వారు వచ్చేటప్పటికీ అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం బాధితులు సంతోషలక్ష్మీ, భాస్కర్‌రెడ్డి వేర్వేరుగా అగ్నిమాపక కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు మహేందర్‌రెడ్డిపై బీఎన్ఎస్ యాక్ట్ 118(1), 115(2), 351, 352 సెక్షన్ల ప్రకారం కేసు నమోదు (క్రైం నంబరు 151/2025) చేసినట్టు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

● ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు ● స్వామివారిని దర్శించుకున్న నాయకులు ● ఘనంగా బోనాల ఊరేగింపు



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



వేడుకల్లో పాల్గొన్న రవీంద్రకుమార్, బండా నరేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నాయకులు

చిట్యాలరూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలో రామలింగేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, మహాకుంభాబిషేకం ఆదివారం వైభవంగా సాగాయి. వేకువ జామునుంచే స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ నిర్మాణ దాతలు బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంటు ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య పూజాకార్యక్రమాల్లో మండప పూజలు, శిఖర కలశ స్థాపన, యంత్ర స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, అష్టబలి, కుంభబలి, మహాపూర్ణాహుతి అభిషేకాలు వేద బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహా ఆశీర్వచనం, పండిత సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకుని మొదటగా ధ్వజస్థంభాన్ని మొక్కుకుని ఆలయంలో ప్రథమ పూజితుడైన శ్రీవిఘ్నేశ్వరుడిని, శ్రీరామలింగేశ్వరస్వామిని, శ్రీపార్వతీదేవిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాలు, మహాకుంభాభిషేకం సందర్భంగా గ్రామంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. మహిళలు, యువతులు, చిన్నారులు బోనాలను నెత్తిన ఎత్తుకుని ఆనందంగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు, బోనాలతో గ్రామంలో ఆధ్మాత్మిక శోభ సంతరించుకున్నది. కార్యక్రమంలో సుంకరి ధనమ్మ, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, సుంకరి యాదగిరి, పెద్దబోయిన సత్తయ్య యాదవ్, ఆవుల నర్సింహ, సాగర్ల భిక్షం, సుంకరబోయిన నర్సింహ, ఉయ్యాల నర్సింహ, ఉయ్యాల నాగరాజు, గంగాపురం రాము, ఆడెపు భిక్షంలతో పాటు పలువురు పాల్గొన్నారు.



నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

దర్శించుకున్న పలువురు నాయకులు

ఉరుమడ్లలోని రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు, మహాకుంభాభిషేకం కార్యక్రమానికి మాజీ ఎంపీలు, మాజీ జడ్పీచైర్మన్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్‌నేతలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ జడ్పీచైర్మన్‌లు బండ నరేందర్‌రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, రమావత్ రవీంద్రనాయక్‌తో పాటు సోమ భరత్‌కుమార్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, ప్రసన్నకుమార్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరైనారు.

కేటీఆర్ పర్యటన రద్దు

చిట్యాల మండలం ఉరుమడ్లలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, మహాకుంభాభిషేకం కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రావాల్సి ఉండగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిచెందడంతో కేటీఆర్ పర్యటన రద్దయింది.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కుమారులకు గాయాలు

గరిడేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తండ్రీ కుమారులకు తీవ్ర గాయాలై ఘటన ఆదివారం మండలంలో జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలం రాజారాం గ్రామానికి చెందిన తండ్రీ కుమారులు చెన్నబోయిన కృష్ణయ్య, ఆకాష్‌లు వ్యక్తిగత పనుల నిమిత్తం హుజూర్‌నగర్ వచ్చి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. అదే సమయంలో హుజూర్‌నగర్ వైపు నుంచి నేరేడుచర్ల వైపు కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామశివారులోని బృందావనం ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే హుజూర్‌నగర్ వైపునుంచి నేరేడుచర్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనాన్ని వెనకాల నుంచి ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న తండ్రీ కుమారులు కిందపడడంతో ఇద్దరి తలలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు మిర్యాలగూడ తరలించారు.

పేకాట శిబిరంపై దాడి..

ఆరుగురు జూదరుల అరెస్టు

మేళ్లచెర్వు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండల పరిధిలోని గుడిమల్కాపురం గ్రామశివారులో వ్యవసాయ బావి వద్ద పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చింతలపాలెం ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి

● కనగల్ మండలం కురంపల్లిలో పిడుగుపడి ఒకరు ● మిర్యాలగూడ మండలంలో రోడ్డు ప్రమాదంలో మరొకరు దుర్మరణం ● విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృత్యువాత





పిడుగుపాటుతో మృతి చెందిన సత్తమ్మ, ఇన్‌సెట్‌లో సత్తమ్మ (ఫైల్)

కనగల్, జూన్8 : (ఆంధ్రజ్యోతి) నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని కురంపల్లి గ్రామంలో మృగశిరకార్తె రోజున విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన కావలి సత్తమ్మ(50) ఆదివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో గేదెను మేపేందుకు ఆమె తోటి కోడలు లక్ష్మమ్మతో కలిసి గ్రామ శివారుకు వెళ్లింది. గేదెలను మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన ప్రారంభమైంది. ఈక్రమంలో గేదెలను తోలుకుని ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో ఎస్ఎల్‌బీసీ కాల్వకు సమీపంలో సత్తమ్మపై పిడుగు పడింది. ఈ దుర్ఘటనలో సత్తమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సత్తమ్మ మెడలోని బంగారు గొలుసు పిడుగుపాడుకు కాలి ముక్కలైంది. పిడుగుపడిన ప్రాంతానికి కాస్త దూరంలో ఉన్న సత్తమ్మ తోటికోడలు లక్ష్మమ్మ ఈ ప్రమాదం నుంచి తృటిలో బయటపడింది. కాగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సత్తమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు సైదులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. సత్తమ్మ మృతికి గ్రామ మాజీ సర్పంచ్‌వర్సు పెంటయ్య తదితర నాయకులు సంతాపం ప్రకటించారు. ఇదిలాఉంటే గతేడాదిన్నర క్రితం సత్తమ్మ భర్త మల్లయ్య విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఇప్పుడు భార్య పిడుగుపాటుకు గురై మృతి చెందింది. వరుస దుర్ఘటనలతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రోడ్డుప్రమాదంలో మహిళ..

మిర్యాలగూడ అర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అద్దంకి-నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై శనివారంరాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడి మృతి చెందింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్‌కు చెందిన పొట్లూరి అలివేలు(35) తన తల్లి బొజ్జ యశోధతో కలిసి వ్యక్తిగత పనికోసం ఏపీ రాష్ట్రం గుంటూరుకు వెళ్లి స్వస్థలానికి లారీలో ఎక్కి బయలు దేరారు. తల్లీకూతుళ్లు ప్రయాణిస్తున్న లారీ డ్రైవర్ మండలంలోని కిష్టాపురం గ్రామ సమీపంలో బహిర్భూమికి వెళ్లేందుకు తన వాహనాన్ని నిలిపివేశాడు. ఇదే సమయంలో అలివేలు ఆమె తల్లి యశోధతో కలిసి మూత్ర విసర్జన కోసం లారీ దిగి రోడ్డు దాటేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న ఏపీ కారు అదుపుతప్పి ముందుగా వెళ్తున్న అలివేలును ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అలివేలు అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. అలివేలుకు భర్త శ్రీనివాస్, పదేళ్ల బాలుడు ఉన్నాడు. కాగా తల్లి బొజ్జ యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.



మిర్యాలగూడ మండలం కిష్టాపురంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అలివేలు

విద్యుదాఘాతంతో పాడిగేదెలు..

విద్యుదాఘాతానికి గురై నాలుగు పాడిగేదెలు, రెండు లేగదూడలు మృతిచెందిన సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరంగి తిరుపతమ్మ, నాలి లక్ష్మయ్య, కడెం తీరస్‌కు చెందిన ఆరు పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. రోజు మాదిరిగానే గ్రామ శివారులోని జొన్నలగడ్డ రాంరెడ్డికి చెందిన వ్యవసాయ భూమిలో మేత కోసం వెళ్లిన గేదెలు కిందపడిపోయిన హెచ్‌టీ విద్యుత్ లైన్ తీగను తాకి అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న, ఎస్ఐ లక్ష్మయ్య విద్యుత్ ఏఈ అమర్‌సింగ్‌తో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కొంతకాలంగా రైతు రాంరెడ్డి పొలంలో నుంచి వెళ్తున్న విద్యుత్ హైటెన్షన్ (హెచ్‌టీ) కిందకు వాలి ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా విద్యుత్ ప్రమాదంతో పాడి గేదెలు మృతిచెందడంతో బాధిత పాడి రైతులకు సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం జరిగింది. ఈ ఘటనపై విచారణ అనంతరం బాధిత పాడి రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.



మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలో మృతి చెందిన గేదెలు

రోడ్డు ప్రమాదంలో మూడు పాడిగేదెలు

మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామం వద్ద కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న డీసీఎం వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కన వెళ్తున్న గేదెల మందపైకి దూసుకెళ్లడంతో మూడు పాడి గేదెలు మృతిచెందాయి. అవంతీపురం గ్రామానికి చెందిన సిరికొండ వెంకటమ్మ, వీరయ్య దంపతులు తమ పాడిగేదెలు తప్పి పోవడంతో పరిసర గ్రామాల్లో వెతికారు. ఆలగడప గ్రామ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న తమ పాడి గేదెలను గుర్తించి రోడ్డు మార్గంలో ఇంటికి తీసుకవస్తున్న క్రమంలో టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మూడు పాడిగేదెలు, లేగ దూడ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. గేదెల యజమాని వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడి పాడి రైతు కుటుంబానికి సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం కలిగించిన డ్రైవర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

'అమ్మ ఆదర్శ పాఠశాలకు' నిధుల గ్రహణం



వేములపల్లి మండలం శెట్టిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

» జిల్లాలో 2,862 పాఠశాలల్లో సదుపాయలన కల్పన పనులు
» రూ. 40.83కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో అంచనా వ్యయం
» రూ. 29.08 కోట్ల నిధులతో మొదలైన పనులు
» బిల్లుల కోసం నిరీక్షిస్తున్న కాంట్రాక్టర్లు

మిర్యాలగూడ అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కనీస సౌకర్యాలు మెరుగుపరిచేందుకు జిల్లా అధికార యంత్రాంగం నడుంబిగించింది. అందుకు డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నిధులు కేటాయించాలని నిర్ణయించారు. విద్యాశాఖ అధికారులు మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్న పాఠశాలలను గుర్తించి కలెక్టర్ నివేదించారు. దీంతో ఆరు నెలల క్రితం జిల్లాలోని 31 మండలాల పరిధిలో గల 2,862 పాఠశాలలను ఎంపిక చేశారు. తాగు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని జిల్లా అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణలో బహిర్గతం కాగా, విద్యార్థినీ, విద్యార్థులు సైతం తమ ఇబ్బందులను ఏకరువు పెట్టుకోడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. దీంతో 'అమ్మ ఆదర్శ పాఠశాల' పేరుతో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టారు. దీంతో జిల్లాలో కనీస వసతులకు దూరంగా ఉన్న పాఠశాలలకు డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయింపులు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆయా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల నిర్వహణ బాధ్యతలను కొన్ని చోట్ల కాంట్రాక్టర్లకు, మరికొన్ని మండలాల్లో స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) అప్పగించారు. దీంతో గతేడాది నవంబరు నెలలో పనులు షురూ చేశారు. పాఠశాలల్లో తాగు నీటి సౌకర్యం కోసం మినీవాటర్ ట్యాంకు నిర్మాణం, కుళాయిల ఏర్పాటు, టాయిలెట్ల నిర్మాణం, ఆధునికీకరణ, కరెంటు సౌకర్యం తదితర పనులు కొన్ని మండలాల్లో పూర్తికాగా, పలు చోట్ల తుదిదశకు చేరుకున్నాయి. పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్నప్పటికీ నేటి వరకు చేసిన పనులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయింపులు జరగలేదంటూ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు ప్రక్రియలో కాలయాపన జరుగుతున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయల కల్పన తీరు ఒక అడుగు ముందుకు ఐదడుగులు వెనక్కు అన్న చందంగా ముందుకు సాగుతున్నాయి.

నిండుకున్న డీఎంఎఫ్‌టీ ఖజానా

జిల్లాలోని ఖనిజ వనరుల ద్వారా సీజరేజీ ద్వారా డిస్ట్రిక్ మినరల్ ట్రస్ట్ ఫండ్‌కు నిధులు సమకూరుతాయి. జిల్లాలో సిమెంట్ పరిశ్రమలు, కంకర క్వారీలు, క్రషర్లు, ఇసుక రీచ్‌ల ద్వారా డీఎంఎఫ్‌టీకి నిధులు సమకూరుతున్నాయి. ఖనిజ వనరుల వినియోగం కోసం సీనరేజీ చెల్లింపుతో వచ్చే ఆదాయం నుంచి 30 శాతం నిధులను పలు అభివృద్ధి పనులకు కేటాయిస్తుంటారు. అయితే కొద్దినెలలుగా జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల కొనసాగింపునకు డీఎంఎఫ్‌టీ నిధులను మళ్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎంఎఫ్‌టీ ఖజానా నిండుకోవడంతో ఆ నిధులు ఆధారంతో చేపట్టిన పనులకు సకాలంలో చెల్లింపులు చేయలేని దుస్థితి ఏర్పడినట్లుగా అధికార వర్గాలు చెబుతున్నాయి.

నిధుల మంజూరులో తీవ్ర జాప్యం

జిల్లాలోని 2,862 ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు మెరుగుపర్చేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 40.83కోట్ల నిధులను ఖర్చు చేయాలని అంచనా వేశారు. ఈ నిధులను డీఎంఎఫ్‌టీ నుంచి వినియోగించేందుకు ప్రతిపాదించారు. పరిపాలన పరమైన అనుమతులు లభించడంతో 2,460 పాఠశాలల్లో మొదలైన పనులు తుది తశకు చేరగా, బిల్లుల చెల్లింపు ప్రక్రియ సజావుగా సాగడం లేదన్న భావనతో మిగతా 402 పాఠశాలల్లో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పర్యవేక్షణ అధికారులు పూర్తయిన పనులను సంబంధించి రూ.29.08కోట్ల నిధులతో ఎంబీ రికార్డు చేయగా, రూ.9.96కోట్ల నిధులు మాత్రమే విడుల కాగా మిగిలిన రూ.19.12కోట్ల నిధుల కోసం కాంట్రాక్టర్లు నిరీక్షిస్తున్నారు. తొలిదశలో మొదలైన పనులకు నిధుల గ్రహణం పట్టుకుంది. దీంతో మలివిడతగా మిగిలిన పనులను చేపట్టేందుకు నిరాసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాలయ కల్పన అటకెక్కుతోంది.

అప్పులు చేసి పనులు చేశాం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద రూ.4.50 లక్షల అంచనాలతో కూడిన పనులు మంజూరయ్యాయి. పనులు చేసిన వెంటనే బిల్లు వస్తాయని చెప్పడంతో అప్పులు చేసి పనులు పూర్తిచేశాం. ఆరు నెలలు గడుస్తున్నా పైసా బిల్లు ఇవ్వకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. మా ఇబ్బందులు గుర్తించి బిల్లులు మంజూరు చేయాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నాం.

- పెదమాం వాణి శెట్టిపాలెం, వేములపల్లి

చెల్లింపుల్లో కొంత జాప్యం జరుగుతోంది

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2025-26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టి పలు రకాల పనులు పూర్తి దశకు చేరాయి. బిల్లుల చెల్లింపుల్లో కొంత జాప్యం జరుగుతన్న మాట వాస్తవమే. పూర్తయిన పనుల నాణ్యతను పరిగణించి ఎంబీ రికార్డు పూర్తి చేసి బిల్లుల కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాం. ఇన్‌చార్జిగా పనిచేసిన వేములపల్లి మండల పరిధిలో రూ. 25 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

- దినేష్‌రెడ్డి, ఏఈ, ఆర్‌అండ్‌బీ, నల్లగొండ



సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	511.60 అడుగులు
టీఎంసీలు	134.4032
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	900 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	900 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	24.96 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	640.30 అడుగులు
టీఎంసీలు	3.28
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	222. 68క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	87.88క్యూసెక్కులు

శాస్త్రీయ విద్య కోసం పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలి

జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ ముప్వా రామారావు

మిర్యాలగూడ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ దృక్పథం పెంపొందే విధంగా పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్వా రామారావు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతి హాస్పిటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యావిధానం - శాస్త్రీయ దృక్పథం' పై సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించే విధంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు హేతుబద్ధ ఆలోచనలతో సమాజ వికాసానికి తోడ్పడే విధంగా పాఠ్యాంశాల్లో మార్పులు తేవాలని అన్నారు. అంధ విశ్వాసాల వైపు మళ్లించి యువతను పెడదోవ పట్టించే అంశాలను పాఠ్యాంశాల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్ మాట్లాడుతూ మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా బోధనలో మార్పులు తేవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ప్రకారం ప్రతీ పౌరుడు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు కొండల్‌రెడ్డి, సత్యనారాయణరావు, యూటీఎఫ్ నాయకులు బక్కా శ్రీనివాసచారి, బీసం రామయ్య, జ్వాల, భిక్షమయ్య, గణేష్, రాముడు శర్మ, కిరణ్మయి, మధుసూదన్, శ్రీనివాస్, ప్రశాంత్, సందీప్, శ్రీధర్, జానకీరాములు, దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు

(5వ పేజీ తరువాయి)



సౌకర్యవంతంగా ఉండే బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. అంగన్‌వాడీ సేవలన్నీ ఆన్‌లైన్‌లో చేసే లక్ష్యంతో గతంలో టీచర్లందరికీ స్మార్ట్ ఫోన్లు, కొత్త సిమ్ము కార్డులు ఇచ్చారు. కానీ, వేర్వేరు నెట్‌వర్క్‌లు, 5జీ సీమ్‌కు, 2జీ స్మార్ట్ ఫోన్‌లను ఇవ్వడంతో సక్రమంగా పని చేయకపోవడంతో టీచర్లు వాటిని వినియోగించడం మానివేశారు. ఈ మేరకు తాజాగా, టీచర్లందరికీ ఒకే నెట్‌వర్క్ సిమ్‌కార్డులు, 5జీ స్మార్ట్ ఫోన్లు రానున్నాయి. దీంతో త్వరలోనే టీచర్ల సెల్ నెంబర్లు మారనున్నాయి.

కొత్తగా ఎగ్ బిర్యానీ

అంగన్‌వాడీ మెనూలో కొత్తగా ఎగ్ బిర్యానీ చేరింది. ప్రస్తుత మెనూలో కొద్దిపాటి మార్పులు చేస్తూ పిల్లలకు వారానికి రెండుసార్లు ఎగ్ బిర్యానీ వడ్డించనున్నారు. అలాగే ప్రోటీన్స్ విటమిన్స్‌తో కూడిన మరిన్ని ఆహార పదార్థాలను ఇవ్వనున్నారు. నూతన మెనూపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో 4,203 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 1,98,979 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు లబ్ధిదారులుగా ఉన్నారు. కొత్త మెనూ అమలుచేస్తే వీరందరికీ లబ్ధి చేకూరనుంది.

కేరళ చిన్నోడి మాటలతో

కేరళ రాష్ట్రం ఇడుక్కికి చెందిన బుడత త్రిజల్ ఎస్.సుందర్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నాడు. ఇంటిదగ్గర రుచికర ఆహారాన్ని భుజించే ఈ బుడతకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న ఉప్మా తదితర ఆహార పదార్థాలు నచ్చలేదు. ఎగ్ బిర్యానీ పెడితేనే అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తానని తల్లితో మారం చేయసాగాడు. దీంతో ఆ చిన్నారి ముద్దు మాటలను తల్లి వీడియో తీసి ఫేస్ బుక్‌లో పోస్ట్ చేసింది. స్వల్ప వ్యవధిలో దేశ ప్రజలందరినీ ఆ వీడియో ఆకర్శించగా, దాన్ని చూసిన కేరళ స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి వీణ జార్జ్ ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల మెనూలో ఎగ్ బిర్యానీ తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పిల్లలందరి అభిరుచులు ఒకే మాదిరిగా ఉంటాయని భావించిన తెలంగాణ ప్రభుత్వం కూడా ఇక్కడి అంగన్‌వాడీ మెనూలో ఎగ్ బిర్యానీ చేర్చినట్లు ప్రచారం. అయితే తన ముద్దు మాటలతో అంగన్‌వాడీ చిన్నారులందరికీ ఎగ్‌బిర్యానీ అందిస్తున్న త్రిజల్ మాత్రం ఎగ్ బిర్యానీ రుచి చూడకుండానే ఈ విద్యా సంవత్సరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని వీడుతుండటం విశేషం.

ఒకే ప్రాంగణంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు

ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు



సాగర్ పైలాన్ కాలనీలో ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న మూడు అంగనావాడీ కేంద్రాలు

నాగార్జునసాగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో మూడు అంగనావాడీ కేంద్రాలను ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు అంగన్‌వాడీకి రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జునసాగర్ (నందికొండ మునిసిపాలిటీ)లో మొత్తం 13 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 5 అంగన్‌వాడీ కేంద్రాలు హిల్ కాలనీలో, మరో 8 అంగన్‌వాడీ కేంద్రాలు పైలాన్ కాలనీలో నిర్వహిస్తున్నారు. పైలాన్ కాలనీలో 9,10,11 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాలు 10వ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న 10వ వార్డు మిగిలిన రెండు (9,11 వార్డులకు) వార్డులకు ఒక కిలోమీటరు దూరం ఉంటుంది. అంతే కాకుండా మూడు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల కొండపై ఉండటంతో 8, 11 వార్డుల గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు ప్రతీ రోజు పాఠశాలకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా కొండపైకి ఎక్కాలంటే గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండటంతో 9,11 వ వార్డుల పిల్లలను అక్కడకు పంపడానికి తల్లిదండ్రులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తగ్గింది. బాలింతలు, గర్భిణులు, మధ్యాహ్న భోజనం కోసం అంత దూరం నడిచి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు చొరవ తీసుకొని ఏ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆ వార్డులో ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు కోరుతున్నారు.

ఏ వార్డు అంగన్‌వాడీలను ఆ వార్డులో నిర్వహించాలి



సాగర్ పైలాన్‌కాలనీలో 9,10,11 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే చోట కాకుండా ఏ వార్డు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా వార్డుల్లో నిర్వహించాలి. ఈ విషయంపై జిల్లా అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తాం.

- తంగరాజు గణేష్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు

ప్రభుత్వ భవనం ఉండటంతో...

సాగర్‌లోని 10వ వార్డులో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం అందుబాటులో ఉండటం వల్ల 9, 10, 11 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాలు అక్కడే ఒకే చోట నిర్వహిస్తున్నాం. 2017 నుంచి అక్కడే నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. ఏమైనా ఇబ్బందులు కలిగితే ఏ వార్డుకు ఆ వార్డు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

- వెంకాయమ్మ, సూపర్‌వైజర్

సైనిక పాఠశాలలు ఏర్పాటు చేయాలి

మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు



తెలంగాణలో సైనిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డికి లేఖ రాసిన అనంతరం చిన్నారి విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వేనేపల్లి పాండురంగారావు

మిర్యాలగూడ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు అయినా విద్య విషయంలో కేంద్రం నుంచి దక్కాల్సిన సైని క పాఠశాలలు మనకు దక్కలేదని మట్టిమనుషు ల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం విద్యార్థులతో కలి సి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ అరవై సంవత్సరా ల తండ్లాట, అనేక త్యాగాలు, అమరుల బలిదానా లు, ఎడతెగని ఉద్యమాలు, నిరంతర పోరాటాలతో సాధించుకున్న రాష్ట్రంలో పుష్కరకాలమైన అనేక విషయాల్లో అభివృద్ధి సాధించలేదని అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేది విద్య ఒక్కటేనని అన్నారు. వారం పదిరోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నందున సైని క పాఠశాల పురోగతిని సమీక్షించాలని కోరినట్లు తెలిపారు. మన రాష్ట్రంలో సైనిక్ పాఠశాలలు ప్రారంభమయ్యేవరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిలో మాట్లాడి మన విద్యార్థులను కూడా వాళ్లకున్న హోమ్ స్టేట్ 67 శాతంలో చేర్చుకునేలా చూడాలని కోరారు. అక్కడ చదువుకునే మన విద్యార్థులను స్థానికులుగా (ఇక్కడి) గుర్తించే విధంగా అనుమతించాలన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను దాదాపు 20 వేలమంది విద్యార్థులు గత ఏప్రిల్‌లో ప్రవేశ పరీక్షలు రాశారని వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రధానమంత్రిని, ఏపీ సీఎం సంప్రదించి త్వరిగతిన పని పూర్తి చేయాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న కోరుకొండ సైనిక పాఠశాల కాకుండా మరో మూడు పాఠశాలలు కేటాయించారని, మన రాష్ట్రానికి ఒక్కటి కూడా ఇవ్వలేదని అన్నారు. తెలంగాణకు కొన్ని పాఠశాలలు నిర్మించేలా ప్రభుత్వంతో చర్చించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు. కేంద్రం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేస్తుందని అందులో భాగంగానైనా తెలంగాణకు కొన్ని పాఠశాలలు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అన్ని ఒకే రకంగా ఉండాల్సి ఉన్నా అన్ని పాఠశాలలు ఒకేలా ఉండకపోవడంతో సైనిక పాఠశాలల ఏర్పాటు గురించి అడగాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టేలా చూడాలని కిషన్‌రెడ్డికి రాసిన లేఖలో కోరినట్లు తెలిపారు.

బుద్ధవనం మెంటర్‌కు అంతర్జాతీయ అవార్డు



బెంగుళూరులో అవార్డును అందుకుంటున్న ఆంజనేయరెడ్డి

నాగార్జునసాగర్ జూన్8:(ఆంధ్రజ్యోతి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ సీఎండీ, ప్రస్తుత బుద్ధవనం మెంటర్ మహాఉపాసిక చెన్నూరు ఆంజనేయరెడ్డికి అంతర్జాతీయ అవార్డు దక్కింది. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరులోని మహాబోధి బుద్ధవిహార సొసైటీ ఆదివారం నిర్వహించిన ప్రతిష్ఠాత్మకమైన ఆచార్య బుద్ధ రకిత అంతర్జాతీయ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఆంధ్రా, తెలంగాణలో బౌద్ధ సంస్కృతిని, దాని పరిరక్షణకు కృషి చేస్తున్న తనకు ఈ అవార్డును మహాబోధి బుద్ధవిహార బిక్కుల సంఘం ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బెంగుళూరు మహాబోధి బుద్ధవిహార సొసైటీ అధ్యక్షుడు మహాకశ్యప పెరో ప్రధాన కార్యదర్శి ఆనందబంతె, సుగదనంద, బుద్ధదత్త, మహాబోధి బుద్ధవిహార హైదరాబాద్ అధ్యక్షుడు బుద్దపాల బంతె మరియు ఆంజనేయరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మునగాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో ఏపీ రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై దారుణ వ్యాఖ్యలు చేసి అవమానించిన జర్నలిస్టు కృష్ణంరాజును,ఆ డిబేట్‌ను నిర్వహించిన కొమ్మనేని శ్రీనివాసరావుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సామాజిక ఉద్యమకారుడు వేమూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. . ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని కోసం అమరావతి రైతులు 33 వేల ఎకరాలు స్వచ్ఛం దంగా ఇచ్చి సహకరించారని. ఎన్డీఏ కూటమికి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధాని పనులు శరవేగంగా జరుగుతుంటే జీర్ణించుకోలేని కొందరు మహిళలపై దారుణమైన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాజాన్ని సంస్కరించాలి



బీబీనగర్ శివారులో బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రీట్రీట్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సెమినార్‌లో మాట్లాడుతున్న కె శ్రీనివాస్ రెడ్డి

బీబీనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించి సమాజాన్ని సంస్కరించగలిగేలా జర్నలిస్టులు పని చేయాలని తెలంగాణ మీడియా అకాడమిక్ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్ గ్రామంలోని బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రీట్రీట్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ శాంతిని ప్రజల హితం కోరి పనిచేసే వాడే నిజమైన జర్నలిస్టులని అన్నారు. శాంతి, సమైక్యత, విశ్వసనీయత అనే 3 అంశాలు ప్రజల్లో సడలిపోతుంటే వాటిని గుర్తు చేయాల్సిన బాధ్యతలను జర్నలిస్టులు విస్మరిస్తే సమాజం ఏమైపోతుందో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు. ఇతర దేశాలతో పోలిస్తే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత దేశంలోనే విభిన్న మతాలు, కులాలు, ఉప కులాల ప్రాతిపదికన విడిపోతున్న పరిస్థితులను చూస్తుంటే అందరికీ బాధ, ఆందోళన కలిగిస్తుందన్నారు. దీనికి ప్రధాన కారణం ఆర్థిక అసమానతలేనని అన్నారు. సోషల్ మీడియాలో వికృత పోకడలతో సమాజంలో శాంతి, ప్రజల్లో విద్వేశాలు పెరిగిపోతున్నాయని అన్నారు. మీడియాలో టెక్నాలజీ పెరిగిన తర్వాత నిమిషాల్లోనే గల్లీ వార్తలు ఢిల్లీకి చేరుతున్నాయన్నారు. అయితే విషయ పరిజ్ఞానం లేని కొందరు వాస్తవాలను దాచి అవాస్తవాలను సమాజంపై రుద్దుతున్నారని విమర్శించారు. ఈ పరిణామాలతో విద్వేశాలు పెరిగి ప్రజల్లో అశాంతి నెలకొంటుందని అన్నారు. సోషల్‌మీడియా కట్టడికి ఎలాంటి కట్టుబాట్లు నిబంధన లేదని ఇదే అదునుగా కొందరు అసత్య ప్రచారాలకు సోషల్ మీడియాను వేదికగా చేసుకుంటున్నారని ఆయన విమర్శించారు. విలువలతో కూడిన జర్నలిజం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఆగడాలను కట్టడి చేయడానికి ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు మంచి కోసం మాత్రమే పని చేయాలే తప్ప స్వార్థం, వ్యక్తిగత ప్రయోజనం కోసం పని చేయకూడదని సూచించారు. సమాజానికి, ప్రపంచానికి పాఠాలు చెబుతామని భావించే జర్నలిస్టులకు శాంతియుత సమాజం ప్రతి రూపాలైన బ్రహ్మకుమారీస్ జర్నలిస్టులకు పాఠాలు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. ఈ మధ్యకాలంలో ప్రాంతాలు, కులాల వారీగా మతోన్మాదులుగా మారిపోతున్న ఈ సమాజంలో శాంతి సమైక్యత నెలకొల్పడంలో జర్నలిస్టుల పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు యు.లక్ష్మణ్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల నాయుడు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తొలుగుతున్న అడ్డంకులు

(5వ పేజీ తరువాయి)

ఆరుసార్లు వేలిముద్ర వేయాల్సి రాగా, 20 నుంచి 30 నిమిషాల వరకు సమయం పట్టేది. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడంతో 10 నిమిషాల్లోనే రేషన్ బియ్యాన్ని పంపిణీచేస్తున్నారు. కొన్ని మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య, సర్వర్ బిజీతో బియ్యం పంపిణీ ఆలస్యమవుతోంది.

కొత్త రేషన్‌కార్డులపై ఇంకా గందరగోళమే

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తగా తెల్ల రేషన్‌కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో చాలా మంది నిరుపేదలు రేషన్‌కార్డు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా తెల్ల రేషన్‌కార్డు ఆరోగ్యశ్రీ వంటి పథకానికి ఉపయోగపడేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజాపాలనలో దరఖాస్తులు తీసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 1.30లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అయితే కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు ప్రభుత్వం పలు వడపోతలు చేపడుతుండటంతో వచ్చిన దరఖాస్తుల్లో 40 నుంచి 45శాతం మేరకు కొత్త రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. వారికి కొత్త కార్డులు జారీ కానప్పటికీ రేషన్ డీలర్లకు అందిన జాబితాలో ఆయా లబ్ధిదారుల పేర్లు ఉండటంతో బియ్యం పంపిణీ జరుగుతోంది. చాలా మంది అర్హులైన నిరుపేదలకు రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంతో వారికి మూడు నెలల రేషన్ అందడం లేదు. గ్రామాలు, పట్టణాలు, వార్డు సభల్లో ప్రదర్శించిన జాబితాల్లో లబ్ధిదారుల పేర్లు ఉన్నప్పటికీ రేషన్ షాపుకు వెళ్లి జాబితాలో చూసుకుంటే పేరు లేకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో నిరాశ చెందిన లబ్ధిదారులు మీ-సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటున్నారు.

డెన్మార్క్ తెలంగాణ సంఘం అధ్యక్షుడిగా ఉపేందర్ ఎన్నిక



డెన్మార్క్ తెలంగాణ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఉపేందర్

హైదరాబాద్ సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నూతన కల్ గ్రామానికి చెందిన గిలకత్తుల ఉపేందర్‌గౌడ్ గత శనివారం డెన్మార్క్ దేశంలోని 'తెలంగాణ సంఘం'కు అధ్యక్షుడిగా ఎన్నికై బాధ్యతలు స్వీక రించారు. ఉపేందర్‌గౌడ్ తండ్రి చినజీడయ్య రిటైర్డు హెచ్‌ఎం, తల్లి గృహిణి. తెలంగాణలో బీసీఏ పూర్తి చేసిన ఉపేందర్ పైచదువుల నిమిత్తం డెన్మార్క్‌కు వెళ్లి, మాస్టర్స్ పూర్తి చేసి అక్కడే స్థిరపడ్డారు. మాతృ భూమిపై ఉన్న అభిమానంతో అక్కడి తెలంగాణ ప్రొఫెషనల్స్‌ను ఏకం చేసి డెన్మార్క్ తెలంగాణ సంఘం స్థాపించారు. ప్రస్తుతం ఈ సంఘానికి ఉపేందర్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గమనార్హం.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

నార్కట్‌పల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల పూర్తిస్థాయి కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్, జిల్లా కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మండల ఉపాధ్యక్షులుగా నోముల నాగరాజు, చిరుమర్తి వెంకన్న, ఉపేందర్, రామలింగం, ప్రధాన కార్యదర్శులు అక్కెనపల్లి సత్తయ్య, బిల్లకంటి శ్రీకాంత్, పురుషోత్తంరెడ్డి, కార్యదర్శులు వనం శంకర్, బెక్కంటి గణేష్, గండికోట శ్రీకాంత్ కోశాధికారిగా తోటకూర శివకుమార్ నియమితులయ్యారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నాంపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరాళ్లపల్లి గ్రామానికి చెందిన శివర్ల నాగరాజు, పొగాకు రాములు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ గ్రామ మాజీ సర్పంచ్ సయ్యద్ గఫర్ మృతుల కుటుంబాలకు ఆదివారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చనబోయిన రమేష్, గునేబోయిన యాదయ్య, మల్లయ్య, రమేష్, కొండల్, సైదులు, వెంకన్న, శ్రీరాములు, లింగస్వామి, రాజు, అంజి, క్షత్రయ్య పాల్గొన్నారు.

రోడ్డు విస్తరించారు.. షిఫ్టింగ్ మరిచారు


రోడ్డు మధ్యలోనే ఉన్న స్తంభాలు

నల్లగొండటౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. రహదారుల విస్తరణ పనులు పూర్తయినా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను మాత్రం తొలగించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా సంబంధిత కాంట్రాక్టర్ కానీ ఇటు విద్యుత్ శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం నుంచి శివాజీనగర్ మీదుగా రామగిరి వరకు కొన్ని నెలల క్రితం రోడ్డు విస్తరణ చేపట్టారు. రోడ్డు కిరువైపులా సీసీ రోడ్డు వేసి విస్తరించేందుకు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో మొదట డ్రైనేజీ నిర్మాణం చేపట్టిన తర్వాత సీసీ రోడ్డు వేశారు. అయితే రోడ్డు వేసే సమయంలో రోడ్డు మధ్యలో వస్తున్న విద్యుత్ స్తంభాలను తొలగించాల్సి ఉన్నా అదేమీ పట్టించుకోకుండా రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారు. దీంతో ప్రస్తుతం ఆ స్తంభాలన్నీ రోడ్డు మధ్యలోకి వచ్చి తరచూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల సిమెంటు లోడుతో వెళ్తున్న లారీ రాత్రి సమయంలో శివాజీనగర్‌లో ఓ మద్యం దుకాణం వద్ద ఉన్న స్తంభాన్ని ఢీకొట్టడంతో ఆ స్తంభం విరిగిపోయింది.

అయితే అది రాత్రి సమయం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అదేవిధంగా బస్టాండ్ నుంచి రామగిరికి వెళ్లే మార్గంలో కూడా ఇటీవల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. అక్కడ రోడ్డు వెంట ఉన్న డబ్బాలన్నింటినీ తొలగించి రోడ్డు విస్తరించారు. అదే సమయంలో అక్కడ ఉన్న స్తంభాల ను షిఫ్టింగ్ చేయాలన్న కనీస ఆలోచన చేయకపోవడంతో అక్కడ కూడా విద్యుత్ స్తంభాలు కూడా రోడ్డుకు మధ్యలోకి వచ్చాయి.దాని ఎదురుగానే విద్యుత్ శాఖ కార్యాలయం ఉండటం గమనార్హం. నిత్యం తమ కళ్ల ఎదుటే రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలు ఉన్నా విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతస్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులు చూస్తూనే ఉన్న వాటిని తొలగించాలనే ఆలోచన రాక పోవడం వెనక విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

» నెలలు గడుస్తున్నా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

ట్రాఫిక్ డైవర్ట్ సమయంలో తీవ్ర ఇబ్బందులు

జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతుంటారు. ఆ సమయంలో అటుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తుంటారు. ముఖ్యంగా హైదరాబాద్ రోడ్డు వైపు వెళ్లే బస్సులు, లారీలు, ఇతర వాహనాలను రామగిరి - శివాజీనగర్- ఎన్టీఆర్ విగ్రహం మీదుగా వాహనాలు మళ్లించడం పరిపాటి. ఆ సమయంలో వచ్చే పోయే వాహనాలతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారుతుంటాయి. అయితే రోడ్డు విస్తరణ చేపట్టినా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించకపోవడం వల్ల రోడ్డు చిన్నగా ఉండి ట్రాఫిక్ జాం అవుతుంది. కొన్ని సందర్భాల్లో చిన్న చిన్న వాహనాలు సైతం ట్రాఫిక్‌లో ఇరుకుపోవాల్సి వస్తుంది. అనేక మార్లు స్థానికులు సమస్య పరిష్కారానికి మధ్యలో విద్యుత్ పోల్స్‌ను తొలగించాలని ఇటు మునిసిపల్, విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. ఇప్పటికైనా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత విద్యుత్‌శాఖ ఏడీఈను వివరణ కోరేందుకు ప్రయంత్నించగా అందుబాటులోకి రాలేదు.



మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించాలి



రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలి. రోడ్డుపై పోల్స్ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో స్తంభాలు మధ్యలో ఉండటంతో తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతుంది. మరీ ముఖ్యంగా స్కూల్స్ వచ్చి పోయే వారితో ఉదయం సాయింత్రం చాలా రద్దీ ఉంటుంది. ఈ సమయంలో హడావుడిలో వేగంగా వెళితే ప్రమాదాల బారిన పడక తప్పదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

\- పగడిమర్రి శ్రీను, నల్లగొండ

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా దాసరి

కనగల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని దొరెపల్లి గ్రామానికి చెందిన దాసరి వెంకన్న రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు పర్సనబోయిన బిక్షం నియామకపత్రాన్ని వెంకన్నకు అందజేశారు. ఈ సందర్భంగా దాసరి వెంకన్న మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇతర నాయకులకు దన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నేత్రాల సేకరణ


కనగల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగౌరారం గ్రామానికి చెందిన కొమరాజు చంద్రకళ(63) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందింది. మృతిరాలి నేత్రాలను ఆమె కుమారులు నల్లగొండ లయన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్‌కు దానం చేశారు. ఇదిలా ఉంటే చంద్రకళ మృతదేహాన్ని సీపీఐ సీనియర్ నాయకుడు మల్లేపల్లి ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీ కరీంపాష వివిధ పార్టీల నాయకులు అంజనేయులు, లింగస్వామి, పాండారి, మాజీ సర్పంచ్ చిలకరాజు, సునీతావెంకన్న, శంకర్, రాంప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రవి, చంద్రహాశి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

వైభవంగా ఎల్లమ్మ బోనాల జాతర

నల్లగొండకల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో గల రేణుకా ఎల్లమ్మ దేవాలయం బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో బోనాల జాతర వైభవంగా జరిగింది. మర్రిగూడ, చుట్టుపక్కల కాలనీలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. బోనాలను ఒకేసారి ఊరేగింపుగా తీసుకురావటంతో దారి పొడవునా బారులు తీరారు. భక్తులు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కీర్తిస్తూ వేప మండలతో నృత్యాలు చేస్తూ బోనాల ఊరేగింపు సాగింది. భక్తులు కోళ్లు, మేకలను తీసుకువచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి వచ్చిన చీరలను వేలం వేసి భక్తులకు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో వేడుకలు సంప్రదాయ పద్ధతిలో సాగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ ఇంద్రారెడ్డి మృతి


ఇంద్రారెడ్డి (ఫైల్)

మర్రిగూడ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామానికి చెందిన కుంభం ఇంద్రారెడ్డి (80) చిన్న పిల్లల వైద్యులు ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన నివాసంలో అకాల మృతి చెందాడు. ఆయన పుట్టిన ఊరిపై ఉన్న మమకారంతో పేదలకు ఉచిత వైద్య చేయాలనే సంకల్పంతో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లో 40 సంవత్సరాల క్రితం చిన్న పిల్లల ఆస్పత్రిని ప్రారంభించారు. మర్రిగూడ మండలం నుంచి ఎవరైనా వైద్యం కోసం వెళితే వారికి ఉచితంగా వైద్య సేవలు అందించేవారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడమే కాకుండా పాఠశాలల్లో ఉచితంగా సైన్స్ పరికరాలను అందించారు. డాక్టర్ ఇంద్రారెడ్డి అకాల మృతి చెందడంపై గ్రామంలోని ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

నాంపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): భూతగాదాల్లో తల దూర్చుతున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని నాంపల్లి తాజా మాజీ జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు సివిల్ తగాదాల్లో తలదూర్చుతూ రైతులపై అకారణంగా కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. ట్రాక్టర్ డ్రైవర్లను భయభ్రాంతులకు గురి చేస్తూ తన అనుకున్న వ్యక్తుల భూముల్లో దున్నిస్తూ పిర్యాదు చేసిన రైతులపైనే తప్పుడు కేసులు నమోదు చేస్తానని బెదిరిస్తున్నారని అన్నారు. వెంటనే ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు

పాడె పట్టిన ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎంఈవో పాదూరి శ్రీనివాస్‌రెడ్డి (80) నల్లగొండలో అనారోగ్యంతో మృతి చెందారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మృతుడు పాదూరి శ్రీనివాస్ రెడ్డికి సమీప బంధువు. విషయం తెలుసుకున్న ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి నల్లగొండలోని శ్రీనివాస్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని శ్రీనివాస్‌రెడ్డి పాడెను కిరణ్‌కుమార్‌రెడ్డి మోశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చామల మహేందర్‌రెడ్డి, చామల జైపాల్‌రెడ్డి, గంట్ల వేణుగోపాల్ రెడ్డి, కన్మంతరెడ్డి వెంకట్ రెడ్డి, చామల అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడిగల కిరాయికి బహిరంగ వేలం

నల్లగొండ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తులసీనగర్‌లో గల శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయానికి చెందిన 4 మడిగలను విడివిడిగా రెండేళ్ల కిరాయికి ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.కుశలయ్య తెలిపారు. కొబ్బరి చిప్పల సేకరణ కోసం ఈ నెల 16వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.


పాడె మోస్తున్న ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి

జోరుగా సాగిన చేపల అమ్మకాలు

నల్లగొండ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు ప్రత్యేక వాహనాల్లో చేపలను తీసుకువచ్చి విక్రయించారు. మృగశిర కార్తె రోజున చేపలు తీసుకోవాలనే సంప్రదాయం ఉండటంతో ప్రజలు అధిక సంఖ్యలో చేపలను కొనుగోలు చేశారు. విజయవాడ, గుంటూరు, మిర్యాలగూడ ప్రాంతాలతో పాటు ఖాజీరామారం, చెట్లచెన్నారం, తుమ్మలగూడెం చెరువుల నుంచి చేపలను పట్టణానికి తీసుకువచ్చి ఆయా ప్రాంతాల్లో విక్రయించారు. ప్రత్యేక వాహనంలో ఆక్సిజన్ సాయంతో లైవ్‌లో ఉన్న చేపల అమ్మారు. బతికి ఉన్న బొచ్చెలు, రవ్వలు, కొర్రమీన్లు, బురద మట్టలను గిరాకీని బట్టి ధరలను ఎప్పటికప్పుడు పెంచి విక్రయించారు. కొర్రమీను కిలో రూ.700 వరకు పలికింది. రవ్వలు, బొచ్చెలు కిలో రూ.220 వరకు విక్రయించారు. బురదమట్టలు రూ.400, రొయ్యలు రూ.600 వరకు విక్రయించారు. బతికి లేని చేపలను తక్కువ ధరలకు అమ్మారు. చేపలను కడిగే వారు కిలో ఒక్కంటికి రూ.40 చొప్పున వసూలు చేశారు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా చేపల అమ్మకాలే సాగాయి. తెల్లవారుజామునుంచే ప్రజలు చేపలను కొనుగోలు చేసేందుకు క్యూ కట్టారు. డిమాండ్ పెరగటంతో చేపల వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలను పెంచి సొమ్ము చేసుకున్నారు. పట్టణంలోని పానగల్ బైపాస్ రోడ్‌కు ఇరు వైపులా, దేవరకొండ రోడ్డు, వైఎస్ఆర్ విగ్రహం కూడలి, ప్రకాశంబజార్‌లోని చేపల మార్కెట్, హైదరాబాద్ రోడ్డు, మిర్యాలగూడ రోడ్డు ప్రాంతాల్లో చేపల అమ్మకాలు ముమ్మరంగా సాగాయి.


నల్లగొండ పానగల్ సమీపంలో చేపలు కొనుగోళ్లు చేస్తున్న స్థానికులు

మంత్రి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి

● కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, నల్లగొండ రూల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మండలంలోని పెద్దసూరారం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో రూ. 7లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, రూ.10 లక్షల వ్యయంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు పనులకు మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్యలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని తెలిపారు. విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి మంత్రి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని స్పష్టం చేశారు. పెద్దసూరారం అన్ని సౌకర్యాలు కల్పించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి పలువురికి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి యాదగిరియాదవ్, నాయకులు ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి, తంతెనపల్లి రామలింగం, ఏడుదొడ్ల కొండల్‌రెడ్డి, ఏడుదొడ్ల కృష్ణారెడ్డి, గుండె వెంకన్న, ముసుకు బిక్షం, కోట్ల జలంధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

నల్లగొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత డీఈ యారాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కోచ్ ప్రకాశ్‌నారాయణ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. క్రీడాకారులకు పది వేల విలువైన పోషకాహారాన్ని బండారు రమేష్ అందజేశారు. ఈ కార్యకమంలో జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, డాక్టర్ సిహెచ్ నరేంద్ర, లక్ష్మణ్, నాగరాజు, ప్రేమ్ కుమార్, శివ, వెంకట్, శ్రీను, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వైభవంగా కంఠ మహేశ్వరస్వామి బోనాలు

నల్లగొండరూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని పానగల్ గ్రామంలో బోనాలను కన్నుల పండువగా నిర్వహించారు. బోనాల కుండలు నెత్తిన పెట్టుకొని అధిక సంఖ్యలో మహిళలు, గౌడ కులస్థులు, బంధువులతో కలిసి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా కంఠమహేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లారు. అనంతరం స్వామి వారికి బోనాలను సమర్పించారు.


పూజల్లో పాల్గొన్న గౌడ కులస్థులు

పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

చిట్యాలరూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటైన పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు కూనూరు గణేష్ డిమాండ్ చేశారు. మండలంలోని వెలిమినేడులో ఆదివారం జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయని అందులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు తక్కువగా ఉన్నాయని, పరిశ్రమల యాజమాన్యం ఇతర ప్రాంతాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం అన్యాయమన్నారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకపోతే ఆయా పరిశ్రమల ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గోలి సాయికిరణ్, అరూరి ప్రణీత్, అరూరి శివ, మల్లం కల్యాణ్, శ్రీకాంత్, మధు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


వెలిమినేడులో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు కూనూరు గణేష్

కరాటేతో క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం



సమావేశంలో మాట్లాడుతున్న జేకేపీ చీఫ్ రాపోలు సుదర్శన్

నల్లగొండరూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కరాటేలో శిక్షణ పొందడం వల్ల క్రమశిక్షణతో పాటు ఆత్మస్థైర్యంతో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని దక్షిణ భారత జేకేపీ చీఫ్ రాపోలు సుదర్శన్ మాస్టర్ అన్నారు. పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు గ్రేడుల వారీగా బెల్టులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, ఆరోగ్యంతో ముందుకుసాగుతారని అన్నారు. చిన్నతనం నుండే విద్యార్థులు కరాటే, ఇతర ఆటలు ఆడటం ద్వారా మానసికంగా పరిపక్వత చెందుతారన్నారు. ఆ విద్యార్థులు అన్ని రంగాల్లో వికసిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో గ్రూప్-2, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు కోచింగ్ ఇవ్వడం వల్ల ఎంతో మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఎంవీఎన్ ఆధ్వర్యంలో ప్రిపేర్ అయ్యే వారికి గ్రంథాలయం, స్టడీ హాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, ఎంవీఎన్ ట్రస్టు కార్యనిర్వహణ కార్యదర్శి పి.నర్సిరెడ్డి, జేకేపీ జిల్లా అధ్యక్షుడు కె.నగేష్, చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్, మాస్టర్ బృందం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

చిట్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండలంలోని ముదిరాజ్ విద్యార్థులకు ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. శాలువాలు, మెమెంటోతో సన్మానించి రూ. 1,116 నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గొడుగు యాదగిరి మాట్లాడుతూ ఆరేళ్లుగా సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గొడుగు యాదగిరి, నాయకులు పల్లెమోని చెన్నయ్య, గొడుగు అనిల్‌కుమార్, నర్సింహ బాలాజీ, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

చిట్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని బీజేపీ జిల్లా కార్యదర్శి పజ్జూరి వెంకట్‌రెడ్డి కోరారు. చిట్యాల పట్టణంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావితరాలు బాగుండాలంటే అందరూ మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పదకొండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్డుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, నాయకులు మాస శ్రీనివాస్, చికిలంమెట్ల అశోక్, భానుక ఉదయ్, కందాటి చంద్రారెడ్డి, భానుక సాగరిక, సుంచు శ్రీను, ముక్కాముల పరమేష్, ధనుంజయ్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన


వట్టిమర్తి గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో సైదానాయక్


చిట్యాలరూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు సులభతరమయ్యే విధంగా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఐ) ద్వారా పాఠ్యాంశాల బోధన తరగతులను నిర్వహిస్తామని ఎంఈవో పానుగోతు సైదానాయక్ అన్నారు. చిట్యాల మండలం వట్టిమర్తి, పెద్దకాపర్తి గ్రామాల్లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం ఉంటుందని అన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలు సులువుగా అర్థమయ్యే విధంగా ఉంటాయని కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 9 జూన్ 2025

చికెన్ ధరలు	
లైవ్	147
డ్రెస్	213
స్కిన్‌లెస్	243
గుడ్డు డజన్	66
ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	24.6

సమాజాన్ని సంస్కరించాలి
సోదరభావాన్ని పెంపొందించాలి
మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి
7

కాంగ్రెస్‌లో నైరాశ్యం



- క్యాబినెట్ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు దక్కని చాన్స్
- డిప్యూటీ స్పీకర్ పోస్టూ దక్కనట్లే!
- అసంతృప్తిలో పార్టీ శ్రేణులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందంటే నల్లగొండ కార్యకర్తల శ్రమతోనే అనే మాట నినాదానికే పరిమితమైందే తప్ప ఆ స్థాయిలో ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లా నేతలకు ప్రాతినిథ్యం దక్కలేదని కాంగ్రెస్ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇదిగో, అదిగో అంటూ సాగదేసి ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లా నేతలకు అవకాశం ఇవ్వక పోవడంపై నేతల్లో అసంతృప్తి నెలకొంటే క్యాడర్‌లో తీవ్ర నైరాశ్యం కనిపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

మంత్రివర్గ విస్తరణలో తప్పకుండా అవకాశం దక్కుతుందని భావించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మొండి చేయి చూపింది. రాజగోపాల్‌రెడ్డి బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో, అదే విధంగా గడచిన లోకసభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇవ్వడం, పలు సందర్భాల్లో కీలక నేతలు ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావించడంతో రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో అవకాశం తప్పకుండా వస్తుందని భావించినప్పటికీ చివరికి చాన్స్ దక్కలేదు. జిల్లాలు, సామాజికవర్గాలతో సంబంధం లేకుండా సమర్థతకు అవకాశం ఇవ్వాలని రాజగోపాల్‌రెడ్డి ఇటీవల తన వాదనను తెరమీదకు తెచ్చారు. అయినా అధిష్ఠానం ఆయన వాదనకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఒకే జిల్లా, ఒకే కుటుంబం, రెడ్డి సామాజికవర్గ సమీకరణలే చివరికి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కకుండా చేశాయని రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

బాలూనాయక్‌కు దూరమైన క్యాబినెట్ కల

ఎమ్మెల్యేగా రెండో పర్యాయం గెలవడం, అంతకు ముందు జడ్పీ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం, ఎస్టీల్లో లంబాడా సామాజికవర్గానికి క్యాబినెట్లో ప్రాతినిథ్యం లేకపోవడం వంటి సమీకరణలతో పాటు సీనియర్ నేతల ఆశీసులతో బాలునాయక్‌కు ఈ దఫా మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. ఏదైనా కారణాలతో అది దూరమైనా క్యాబినెట్ హోదాతో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాయమని భావించినప్పటికీ అధిష్ఠానం ఈ సమీకరణ లేవీ పరిగణనలోకి తీసుకోలేదు. మంత్రివర్గంలో లంబాడా సామాజికవర్గానికి ప్రాతినిథ్యం ఇవ్వాలనే అంశానికి ప్రాధాన్యం ఇవ్వకపోగా, డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డాక్టర్ రామచందర్ నాయక్‌కు ఇస్తున్నట్లు ప్రకటించడంతో బాలూనాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి కూడా దూరమైంది. ఉమ్మడి జిల్లాకి చెందిన ఎస్సీ, ఎస్టీ కీలక నేతలకు ఇటీవల ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వడంతో పాటు, లంబాడా సామాజికవర్గం ఎక్కువగా కేంద్రీకృతమైన మహబూబాబాద్ జిల్లాకు అవకాశం ఇవ్వాలనే సమీకరణ బాలూనాయక్‌కు పదవినిదూరం చేసిందనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వెల్లడవుతోంది. మొత్తంగా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన ఉమ్మడి జిల్లాకు క్యాబినెట్‌లో, తత్సమాన పదవుల్లో అవకాశం దక్కకపోవడంతో జిల్లాను విస్మరించినట్లేననే భావన క్యాడర్‌లో వ్యక్తమవుతోంది.



అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు

మెనూలోనూ మార్పులు

భువనగిరిటౌన్,జూన్ 7(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ఆరేళ్లలోపు ప్రీ ప్రైమరీ విద్య, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, వారి ఆరోగ్యంపై సకల జాగ్రత్తలు తీసుకుంటున్న అంగన్‌వాడీ కేంద్రాలు సామాజిక సేవా కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ నడుం బిగించింది. ఇటీవల అంగన్‌వాడీటీచర్ల, ఆయాల ఉద్యోగ విరమణ వయోపరిమితి 60నుంచి 65 ఏళ్లకు పెంచడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రెట్టింపు చేసింది. అంతేగాక అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా కొత్తరూపం ఇచ్చేందుకు నిర్ణయించింది.దీంతో వసతులు, టీచర్లకు 5జీ ఫోన్లు, కొత్త మెనూ,తదితర కొత్తహంగులు సమకూరనున్నాయి.

సకల వసతులు...

అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలను మెరుగుపరచడం, నూతన హంగులు కల్పించడం తదితర అంశాలతో ఇటీవల హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ రెండు రోజులపాటు మేధోమదన సదస్సు నిర్వహించింది. మంత్రి సీతక్క, ఆ శాఖ ఉన్నతాధికారులతో పాటు అన్ని జిల్లాల సంక్షేమ అధికారులు, ఎంపిక చేసిన సీడీపీవోలు, తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 57 రకాల విద్య, వినోద సామగ్రి అందించేందుకు ఈ సదస్సులో నిర్ణయం తీసుకున్నారు. అంగన్‌వాడీల్లో ప్రవేశాలు, అవగాహన కోసం కేంద్రాల వారీగా అమ్మ అంగన్‌వాడీ బాట, అంగన్‌వాడీతో సెల్ఫీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించిన ప్రభుత్వం, తాజాగా అన్ని కేంద్రాలకు ఫర్నిచర్‌ను అందించనున్నది. పౌష్టికాహారం కోసం వస్తున్న గర్భిణులు, బాలింతలు నేలపై కూర్చునేందుకు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో కూర్చునేందుకు...

- మిగతా 7వ పేజీలో...

చౌకధరల దుకాణాల ద్వారా నిరుపేదలకు మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ ప్రక్రియలో ఆరు రోజుల పాటు పలు సమస్యలు ఎదురయ్యాయి. సన్నబియ్యం కావడంతో ప్రతి ఒక్కరూ బియ్యం తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో మూడు నెలలకు సంబంధించి ఒకేసారి బియ్యం ఇస్తుండటంతో తెల్ల రేషన్‌కార్డు దారులు చౌకధరల దుకాణాల వద్ద బారులుతీరుతున్నారు. అయితే సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



తొలుగుతున్న అడ్డంకులు

- రేషన్ పంపిణీకి కొత్త సాఫ్ట్‌వేర్ ఏర్పాటు
- రెండు రోజుల నుంచి కొంత వెసులుబాటు
- మూడు సార్లు బయోమెట్రిక్‌తో బియ్యం పంపిణీ
- ఈనెలాఖరు వరకు బియ్యం పంపిణీకి చర్యలు
- కొత్త రేషన్ కార్డుల జారీలో ఇంకా గందరగోళమే

తెల్ల రేషన్‌కార్డుదారులకు గతంలో ప్రతీ నెల 15 రోజులు మాత్రమే బియ్యం పంపిణీచేసేవారు. ప్రస్తుతం మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీచేస్తుండటంతో బయోమెట్రిక్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీతో ఈనెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈవిషయం కార్డుదారులకు తెలియక షాపుల వద్ద పడిగాపులుకాస్తున్నారు.డీలర్లు సైతం ఈనెల 30 వరకు బియ్యం పంపిణీ జరుగుతుందని లబ్ధిదారులకు వివరిస్తుండటంతో వారిపై ఒత్తిడి తగ్గింది. అదేవిధంగా పౌరసరఫరాలశాఖ సైతం నెలరోజులపాటు బియ్యం పంపిణీ ఉంటుందని, ఎలాంటి అపోహలకు గురికావొద్దని ప్రచారం చేయడంతో సమస్య తగ్గుముఖం పట్టింది.గతఆరు రోజులవరకు ఒక్కకార్డుదారుడు ఆరుసార్లు బయోమెట్రిక్‌కు సంబంధించి వేలిముద్ర వేయాల్సి ఉండగా,సాఫ్ట్‌వేర్ మార్చడంతో ప్రస్తుతం మూడుసార్ల బయోమెట్రిక్‌తోనే బియ్యం పంపిణీ చేస్తున్నారు.దీంతో 50శాతం మేర సమస్యలు తగ్గాయి.

పాత సాఫ్ట్‌వేర్‌తో పలు సమస్యలు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా గత ఆరు రోజులుగా రేషన్ బియ్యం పంపిణీలో బయోమెట్రిక్ విధానం సమస్యగా మారింది. గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్‌ను యథావిధిగా అమలు చేసే ప్రయత్నం బెడిసికొట్టింది. దీంతో రెండు రోజుల క్రితం సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో శని, ఆదివారాల్లో ఈ సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికి ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలకు సంబంధించి బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తున్నారు. ఒక్కో వ్యక్తి ఆరు కిలోల బియ్యం పంపిణీచేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచే పంపిణీ ప్రారంభమైనప్పటికీ బయోమెట్రిక్ విధానం సమస్యగా మారింది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదు కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం కిలో బియ్యం ఇస్తున్న నేపథ్యంలో పలుమార్లు వేలిముద్రలు నమోదుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీం తో సర్వర్ బీజీగా మారింది. ఫలితంగా ఒక్కో వినియోగదారుడు 20నిమిషాల నుంచి గంటల పాటు రేషన్ దుకాణం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాక ఒక సంచిలో బియ్యం ఎక్కువగా మ రో సంచిలో బియ్యం తక్కువగా వస్తున్నట్లు లబ్ధిదారు లు చెబుతున్నారు. గతంలో నెలకు సంబంధించిన రేషన్ పంపిణీపై సమాచారం ఉండగా, ప్రస్తుతం మూడు నెలలకు బియ్యం పంపిణీ కావడంతో డీలర్లకు కొంత అవగాహన లేక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీ బియ్యాన్ని అందిస్తున్న క్రమంలో మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తుండటంతో ఏర్పడిన సమస్యలు కొంత మేర తగ్గడంతో లబ్ధిదారులకు కొంత ఊరట కలిగింది.గతంలో ఒక్కో వినియోగదారుడు..

- మిగతా 7వ పేజీలో...

సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో సమస్యలు తగ్గాయి

సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో సమస్యలన్నీ తగ్గుముఖం పట్టాయి. తొలుత సమస్యలు ఏర్పడ్డాయి. మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీతో గతంలో ఉన్న సాఫ్ట్‌వేర్ వల్ల ఇబ్బందులు వచ్చాయి. ప్రస్తుతం ఆ సమస్యలన్నీ సమసిపోయాయి. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యం పంపిణీ నిరంతరం సాగుతోంది. ఈ నెలాఖరు వరకు బియ్యం పంపిణీ చేస్తాం. రేషన్‌కార్డుదారులు ఎలాంటి అపోహలకు గురి కావొద్దు. ఇంకా సమయం ఉన్నందున ప్రతి ఒక్కరూ మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని పొందవచ్చు.

- వెంకటేశ్వర్లు, డీఎస్‌వో, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలో 54లక్షల మెట్రిక్ టన్నులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు నెలలకు సంబంధించి 54లక్షల మెట్రిక్ టన్నులకు పైగా సన్న బియ్యాన్ని లబ్ధిదారుల కు పంపిణీ చేయాల్సింది. ఈ నెలాఖరు వరకు బియ్యం పంపి ణీ జరగనుండటంతో ప్రతీ ఒక్కరికి బియ్యం అందే అవకాశాలు ఉన్నా యి. నల్లగొండ జిల్లాలో 4.84లక్షల రేషన్‌కార్డుదారులకు మూడు నెలల కాలానికి 26.660లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.యాదాద్రి జిల్లాలో 2,18,963 రేషన్‌కార్డుదారులకు 13.51లక్షల మెట్రిక్ టన్నుల బి య్యం, సూర్యాపేట జిల్లాలో 3,24,624మంది కార్డుదారులకు 15.317లక్షల మెట్రిక్ టన్నులకు పైగా బి య్యాన్ని పంపిణీ చేయాల్సి ఉంది. బియ్యం పంపిణీకి ఆరు రోజుల పాటు ఆరుసార్లు వేలిముద్రలు వేయా ల్సి రాగా, ప్రస్తుతం మూడు సార్లు మాత్రమే వేలిముద్రలు తీసుకుంటుండటంతో బియ్యం పంపిణీలో జాప్యం కొంత మేర తగ్గింది.

సనాతన ధర్మానికి కాషాయ జెండా అండ


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

రామగిరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో కాషాయ జెండా ఉన్నంత వరకు సనాతన ధర్మానికి ఎలాంటి ప్రమాదం లేదని ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ పట్టాభిషేక మహోత్సవం, హిందు సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్లగొండలో బీజేపీ, విశ్వ హిందు పరిషత్, బజరంగ్‌దళ్, హిందు దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. రామాలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర బీజేపీ కార్యాలయం, గడియారం సెంటర్ మీదుగా శివాజీనగర్‌లోని ఛత్రపతి శివాజీ విగ్రహం వరకు సాగింది. శోభాయాత్రను రాకేష్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ, హిందు దేశంలో హిందువులు ఐక్యతగా ఉండాలన్నారు. కొంతమంది రాజకీయ నాయకులు హిందువుల మధ్య కులాల పేరుతో చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారని, అటువంటి కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కులాలను గడపలోపు వరకే ఉంచాలని, గడప దాటితే హిందువులుగా ఉండాలన్నారు. హిందువులు ఐక్యతగా ఉంటేనే ధర్మం ఉంటుందని, ధర్మం ఉంటేనే దేశం ఉంటుందని, ఇవి లేని చోట హిందువులు రెక్కలు విరిగిన పక్షుల్లా మారే అవకాశం ఉందన్నారు. హిందు దేశంలో వేలాది సంవత్సరాల క్రితం నుంచే సనాతన ధర్మం ఉందన్నారు. అయితే విదేశీ కుట్రదారులు దేశం మీద పడి దొంగల్లా దోచుకోవడంతో పాటు సనాతన ధర్మాన్ని దెబ్బతీయాలని ప్రయత్నం చేశారన్నారు. హిందు ధర్మాన్ని కాపాడగలిగేవారినే ఎన్నికల్లో గెలిపించుకోవాలని సూచించారు. కొన్ని మతాల వారు వేల కోట్లు ఇచ్చిన కూడా వారి మతానికే ప్రాముఖ్యం ఇస్తున్నారని విమర్శించారు. ఓరుగంటి వంశీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, విశ్వహిందు పరిషత్, బజరంగదళ్, దేవాలయాల పరిరక్షణ సమితి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● మృగశిర కార్తె సందడి


మృగశిర కార్తె సందర్భంగా నల్లగొండ పానగల్ బైపాస్ సమీపంలో చేపలు కొనుగోలుచేస్తున్న ప్రజలు

65వ నెంబరు జాతీయ రహదారిపై రద్దీ


కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలో బారులు తీరిన వాహనాలు

కేతేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం వారాంతపు రద్దీ నెలకొంది. ఏపీ, తెలంగాణలను కలిపే ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పండుగలు, వారాంతంలో రద్దీ మరింత అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో బక్రీద్, మృగశిరకార్తె నేపథ్యంలో శని, ఆదివారాలు సెలవులు రావడంతో హైదరాబాద్, విజయవాడలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేసే వారు విద్యార్థులు వారి స్వగ్రామాలకు శుక్రవారం వెళ్లారు. సెలవులు ముగిసి సోమవారం విధుల్లో చేరాల్సి ఉండడంతో వారంతా తిరుగు పయనమయ్యారు. వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో స్వగ్రామాలకు వెళ్లిన వారంతా ఆదివారం సాయంత్రం తిరిగి ఏపీ, తెలంగాణకు బయల్దేరారు. దీంతో మధ్యాహ్నం వేళ ఖాళీగా ఉన్న హైవే ఆదివారం సాయంత్రం నుంచి ఇరువైపులా వెళ్లే వాహనాలతో రద్దీగా మారింది. విజయవాడ వైపుకు వెళ్లే వాహనాలు కాస్త తక్కువ సంఖ్యలో ఉన్నా, హైదరాబాద్ లేన్‌లో వెళ్లే వాహనాలు మాత్రం బారులుతీరాయి. దీంతో కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద వాహనాలు అర కిలోమీటరు మేర బారులు తీరాయి. టోల్‌కౌంటర్ల వద్ద టోల్ వసూలులో ఆలస్యం జరుగుతుండడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. టోల్‌ప్లాజాలో మొత్తం 12 కౌంటర్లలో ఇరువైపులా ఆరేసి కౌంటర్ల ద్వారా టోల్ వసూలు చేశారు. హైవేపై వాహనాల రద్దీ నేపథ్యంలో హైవే వెంట గ్రామాల్లో బాటసారులు, వ్యవసాయ పనులకు వెళ్లి వచ్చే ట్రాక్టర్లు, గొర్రెలు, మేకల మందలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

యారాల ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండ,జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత డీఈ యారాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కోచ్ ప్రకాశ్‌నారాయణ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం శిబిరంలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడాకారులకు రూ.10వేల విలువైన పోషకాహారాన్ని బండారు రమేష్ అందజేశారు. కార్యక్ర మంలో జిల్లా యువజన క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, డాక్టర్ సీహెచ్ నరేంద్ర, లక్ష్మణ్, నాగరాజు, ప్రేమ్‌కుమార్, శివ, వెంకట్, శ్రీను, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.


ముగింపు కార్యక్రమంలో క్రీడాకారులు

ప్రభుత్వాన్ని ప్రశ్నించేది కమ్యూనిస్టులే

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సూర్యాపేటఅర్బన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిత్యం ప్రభుత్వాలను ప్రశ్నించేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన సీపీఐ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కమ్యూనిస్టులను లేకుండా చేయాల నే చర్యలు బహిరంగ రహస్యమని, తమ మొద టి శత్రువు ముస్లింలు, రెండో శత్రువు క్రైస్తవులు, మూడవ శత్రువు కమ్యూనిస్టులు అంటూ బీజేపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మావోయిస్టులను లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దేశంలో శాంతి భద్రతలు కాపాడకుండా విచక్ష ణా రహితంగా కాల్పులు జరుపుతూ నరమేదా న్ని సృష్టిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ప్రత్యేక వ్యూహం లేదని, కమ్యూనిస్టులతోపాటు మేధావులు, విద్యావంతుల సలహాలు తీసుకొని ప్రభుత్వం ముందుకుపోతే మంచి పాలన అందించవచ్చునన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం నిష్పక్షపాతంగా పథకాలు అమలుచేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మిర్యాలగూడ టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ప్రకృతి ప్రేమికుడు అవిరెండ్ల సందీప్ అన్నారు. వనజీవి రామయ్య స్ఫూర్తితో 2.5లక్షల విత్తనాలను సేకరించినట్లు తెలిపారు. గాంధీనగర్ యూత్ సభ్యుల సహకారంతో పట్టణ, పరిసర ప్రాంతాల్లో పలు రకాల విత్తనాలను సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధైద శ్రీను, నందిపాటి నరేష్, కందికంటి రాజా, కత్తుల అవినాష్, ధైద సాయినాథ్, కొత్తపల్లి ముని, షేక్ రూహిద్, కందికంటి విష్ణు, ధైద కిరణ్ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో బీసీకి స్థానం కల్పించడంపై హర్షం

మాడ్గులపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిమండలి విస్తరణలో బీసీ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరికి స్థానం కల్పించడం హర్షణీయమని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు తవిటి సైదులు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాటాడారు. జనాభా దామాషా ప్రకారం మంత్రిమండలిలో బీసీ మంత్రుల సంఖ్య ఆరుగురు ఉండాలని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అన్నిరంగాల్లో కల్పించినప్పుడే కాంగ్రెస్ చేసిన కులగణనకు సరైనా న్యాయం దక్కుతుందన్నారు.

బడులిలా.. చదువెలా..



అసంపూర్తి నిర్మాణంతో ఉన్న గాంధీపార్కు పాఠశాల

- అసంపూర్తిగా అదనపు నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

(మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి): మరో వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయలు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేవు. పట్టణంలోని గాంధీపార్కు ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టగా అసంపూర్తిగానే ఉన్నాయి. ఇక తాళ్లగడ్డ, షాబూనగర్ ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల ఆదరణ ఎక్కువగానే ఉంది. ఆయా పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విద్యార్థుల తల్లిందండ్రులు ఆరోపిస్తున్నారు.

పట్టణంలో పరిస్థితి ఇలా..

మిర్యాలగూడ పట్టణంలోని బకాల్‌వాడీ, జడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉంది. అయితే ఆయా పాఠశాలల్లో మూత్రశాలలు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లేకపోవడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. గాంధీపార్కు ప్రాథమికోన్నత పాఠశాలలో సమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ పాఠశాలలో టాయ్‌లెట్స్ లేకపోవడం, తాగునీరు అందుబాటులో లేదు. దీంతో విద్యార్థులు భోజన విరామ సమయంలో రోడ్ల మీదకు వస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. షాబూనగర్, తాళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాలలు లోతట్టు ప్రాంతంలో ఉండగా, వర్షాలు కురిస్తే ఆయా పాఠశాలల్లో వరదనీరు భారీగా చేరుతోంది. గత వర్షాకాలంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకే ఇరు విద్యాసంస్థలు నీట మునిగాయి. బడిబాట పేరుతో ప్రచారం చేపట్టిన విద్యాశాఖ అధికారులు సర్కారు బడులలో మౌలిక సదుపాయాల ఏర్పాటుపై దృష్టి సారించాలి. యుద్ధప్రాతిపదిక ఏర్పాట్లు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేస్తాం



గాంధీపార్కు ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు ఎన్నెస్పీ క్యాంపు పాఠశాల, మండలంలోని మరో రెండు పాఠశాలల్లో నిర్మాణ, మరమ్మతుల పనులు మన ఊరు మన బడి నిధులతో చేపట్టాం. నిధులు సకాలంలో విడుద ల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. నిధుల విడుదలకు చర్యలు చేపట్టారు. ఇక ఉన్నత పాఠశాలల్లో టాయ్‌లెట్స్ పనులు చేయిస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని ఏర్పాట్లు చేస్తాం. - లావూరి బాలు, ఎంఈవో, మిర్యాలగూడ



షాబూనగర్ పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ధ్యేయం



పోచంపల్లిలో హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

గుర్రంపోడు, జూన్8: (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్‌ను, తేనపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయితీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భ ంగా మాట్లాడుతూ గత పాలనలో గ్రామాలు అభివృద్ధి ఆమడ దూరంలో ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలధ్యక్షుడు తగుళ్ల సర్వయ్యయాదవ్, నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, గాలిరవికుమార్,జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని మరింత బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివర్ల రమేష్‌యాదవ్

కొండమల్లేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివర్ల రమేష్ యాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి లో బీజేపీని పటిష్ఠం చేసేందుక కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల న్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు భూతరాజు భరత్‌కుమార్, జంగిటి మల్లేష్ యాదవ్, నెల్లికంటి గోపి, అందుగుల సీతయ్య, చందునాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి మృతి పార్టీకి తీరనిలోటు

దేవరకొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ మృతి పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండలో ఆదివారం ఎమ్మెల్యే గోపినాథ్ మృతికి సంతాపం తెలిపి మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉంటు అభివృద్ధి చేశాడన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

మిర్యాలగూడ టౌన్ : ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల టీడీపీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకులు పోగుల సైదులుగౌడ్ సంతాపం తెలిపారు. టీడీపీలో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన మాగంటి తెలుగు యువత హైదరాబాద్ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో తమతో సన్నిహితంగా ఉండేవాడని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థించారు.

సీపీఐ మండల కార్యదర్శిగా జిల్లా యాదగిరి ఎన్నిక

వేములపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన జిల్లా యాదగిరి సీపీఐ మండల కార్యదర్శిగా 7వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన మండల మహాసభలో సీపీఐ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సారథ్యంలో తనను మరోమారు ఎన్నిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మిర్యాలగూడ టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని నారాయణ విద్యాలయ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా నిర్వహించారు. 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 28 ఏళ్ల అనంతరం పట్టణంలోని వైష్ణవి హాల్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను గౌరవంగా సన్మా నించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గురువులు అప్పాల పాండు రంగారావు, పబ్బతి విజయ్‌భాస్కర్, రాజు, ఆక్కి మోహన్, విద్యార్థులు బానాల ప్రవీణ్‌రావు, కొరివి కృష్ణ, కాకాని ప్రవీణ్, సజ్జల ప్రవీణ, కందేల గీత, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నారాయణ విద్యాలయం విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● పెద్దవూర: మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 2010-11 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకోని ఆహ్లాదంగా గడిపారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందచేశారు. కార్యక్రమంలో నాటి ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, మూల శేఖర్‌రెడ్డి, రామాంజిరెడ్డి, ఇరుమాది శ్రీనివాస్‌రెడ్డి, వినోద్‌కుమార్, ముత్యాలు, యాదగిరి, రమేష్, రాములు, పూర్వ విద్యార్థులు శ్రీవాణి, నందిని, శ్వేత, రమణ, పుష్ప, మనీషా, చందన, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, సంజీవ్, శ్రీకాంత్, అమర్‌నాద్, బిచ్చాలు తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూర: నాగార్జున ఉన్నత పాఠశాలలో..

జీవిత పాఠాలు నేర్పిన మాబడిని మరువం

త్రిపురారం : అక్షరాలలో జీవితపాఠాలు నేర్పిన మావూరి బడిని మరువలేమని పూర్వ విద్యార్థులు స్పష్టం చేశారు.. మండలం పరిధిలోని నీలాయిగూడెంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-98 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన పూర్వ ఉపాధ్యాయుల నారాయణ, రవి, సుబ్రహ్మణ్యం, సాగర్‌రావు, కలిమెల నాగయ్య, సూర్యనారాయణరెడ్డి, జానిమియాను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా సహాయసహకారాలు అందిస్తామని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామలింగమ్మ, రవి, వెంకటేశ్వర్లు పద్మ శ్రీనివాస్, కుందెనపల్లి శివ, కంచి రమేష్, రాతికింది శ్రీనివాస్, శంకర్ నాయక్, బూర శ్రీనివాస్, గంగాధర్, హేమలత, శోభారాణి, పద్మ, పార్వతి, ఎడ్ల కరుణాకర్, గోపాల్ పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకల వివరాలు

మిర్యాలగూడ మీదుగా.. గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వైపునకు..

నెం	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1.	07609	పూర్ణ- తిరుపతి స్పెషల్	00-13	00-15	గురువారం
2	17232	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	01-29	01-30	ఆది/మంగళ
3	17222	లోకమాన్యతిలక్-విశాఖ ఎక్స్‌ప్రెస్	04-14	04-15	సోమ/శుక్ర
4	12806	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	08-57	08-58	డైలీ
5	12756	భావ్‌నగర్ సూపర్‌ఫాస్ట్	09:30	09:31	ఆదివారం
6	07791	కాచిగూడ-నడికుడి	11:55	11:57	ఆదివారం మినహా
7	07046	సికింద్రాబాద్-డిబ్రూఘర్ స్పెషల్	13:05	13:06	సోమవారం
8	07638	శ్రీనగర్ - తిరుపతి	13:06	13:07	మంగళవారం
9	07699	నాగర్‌సోల్-బెజవాడ	13:10	13:11	ఆదివారం
10	17230	శబరి ఎక్స్‌ప్రెస్	14:22	14:23	డైలీ
11	17645	రేపల్లె ఎక్స్‌ప్రెస్	14:46	14:47	డైలీ
12	12704	ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్	17:54	17:55	డైలీ
13	12748	పల్నాడు ఎక్స్‌ప్రెస్	18:00	18:01	డైలీ
14	17016	విశాఖ ఎక్స్‌ప్రెస్	18:44	18:45	డైలీ
15	12604	చెన్నై సూపర్‌ఫాస్ట్	19:14	19:15	డైలీ
16	12734	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	20:04	20:05	డైలీ
17	07446	లింగంపల్లి- కాకినాడస్పెషల్	20:54	20:55	మంగళ, గురు, శని
18	08580	సికింద్రాబాద్ - విశాఖ స్పెషల్	21:30	21:32	గురువారం
19	07509	హైదరాబాద్ - తిరుపతి స్పెషల్	22:02	22:03	గురువారం
20	07435	నాగర్‌కోల్ వీక్లి స్పెషల్	22:20	22:22	శుక్రవారం
21	07189	హెచ్‌సాహిబ్- ఈరోడ్ స్పెషల్	23:07	23:09	శుక్రవారం
22	08586	మహబూబ్‌నగర్-విశాఖపట్నం	23:10	23: 12	బుధవారం
23	07165	హైదరాబాద్ - కటక్ స్పెషల్	23:10	23:12	గురువారం
24	67775	డెమో	23:40	---	డైలీ
25	07191	కాచిగూడ మధురై స్పెషల్	23:15	23:17	సోమవారం
26	07695	సికింద్రాబాద్-రామంతపురం స్పెషల్	23:20	23:21	బుధవారం
27	67777	డెమో	---	23:45	డైలీ

మిర్యాలగూడ మీదుగా.. నల్లగొండ, హైద్రాబాద్, సికింద్రాబాద్ వైపునకు..

నెం.	ట్రైన్ నెం	రైలు పేరు	వచ్చేది	పోయేది	వారం
1	07610	తిరుపతి- పూర్ణ స్పెషల్	01-20	01-21	బుధవారం
2	12603	చెన్నై సూపర్‌ఫాస్ట్	01:39	01:40	డైలీ
3	07192	మధురై- కాచిగూడ ఎక్స్‌ప్రెస్	01:45	01:47	గురువారం
4	07436	నాగర్‌సోల్ - కాచిగూడ వీక్లీ స్పెషల్	02:00	02:02	శుక్రవారం
5	12733	నారాయణాద్రి సూపర్‌ఫాస్ట్	02:43	02:45	డైలీ
6	08585	విశాఖ-మహబూబ్‌నగర్	02:45	02:47	బుధవారం
7	07632	నాగర్‌సోల్-హైదరాబాద్	02:45	02:47	సోమవారం
8	17015	విశాఖ ఎక్స్‌ప్రెస్	03:29	03:30	డైలీ
9	07445	కాకినాడ పోర్ట్-లింగంపల్లి ఎక్స్	03:39	03:40	మంగళ/గురు/శని
10	07510	తిరుపతి- హైదరాబాద్‌స్పెషల్	03:55	03:56	శనివారం
11	67778	డెమో	05:30	---	డైలీ
12	67776	డెమో	----	05:35	డైలీ
13	08579	విశాఖ-సికింద్రాబాద్	05:44	05:45	గురువారం
14	12703	ఫలక్‌నామా సూపర్‌ఫాస్ట్	06:51	06:52	డైలీ
15	07696	రామంతపురం-సికింద్రాబాద్	07:04	07:05	శనివారం
16	12747	పల్నాడు సూపర్‌ఫాస్ట్	07:40	07:41	డైలీ
17	17229	శబరి ఎక్స్‌ప్రెస్	08:32	08:33	డైలీ
18	17646	రేపల్లె ఎక్స్‌ప్రెస్	11:05	11:06	డైలీ
19	07047	డిబ్రూఘర్-సికింద్రాబాద్‌స్పెషల్	11:20	11:22	శనివారం
20	12755	భావ్‌నగర్ ఎక్స్‌ప్రెస్	11:32	11:33	గురువారం
21	12805	జన్మభూమి సూపర్‌ఫాస్ట్	15:10	15:11	డైలీ
22	17221	లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్	15:29	15:30	బుధ/శని
23	07166	కటక్- హైద్రాబాద్	15:30	15:32	గురువారం
24	07792	డెమో	16:50	16: 52	ఆదివారం మినహా
25	17231	నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్	16:59	17:00	శుక్ర/ఆది
26	07190	ఈరోడ్- నిడదవోలు	18:48	18:49	ఆదివారం
27	07698	బెజవాడ-నాగర్‌సోల్	19:24	19:25	శుక్రవారం

-(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడటౌన్)

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంపోడు, జూన్8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్వీ నాగార్జున సాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి అభినవ్‌యాదవ్ కోరారు. మండలంలోని మొసంగి గ్రామంలో నల్లగొండ సాయిరాంన్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆసుపత్రి వైద్యుడు ఈశ్వర్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బడుగుల శ్రీను, పిల్లి రామరాజు, చంటి తదితరులున్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

కొండమల్లేపల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి) బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని గుడితండా, ఇస్లావత్‌తండాల్లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో కరపత్రాలు అందజేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్టెబోయిన శ్రీనివాసులు, జాన్‌నాయక్, సైదులు, గణేష్, గీతాంజలి పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేసి మాట్లాడుతున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు

మృగశిర కార్తె సందడి



దేవరకొండలో చేపలు విక్రయిస్తున్న మత్స్య కారులు

దేవరకొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మృగశిరకార్తె ప్రారంభం రోజైన ఆదివారం దేవరకొండలో చిరు జల్లులతో కూడిన వర్షం కురుస్తుంది. దీంతో వాతావరణం చల్లబడింది. కొద్ది నెలలుగా ఎండ వేడిమికి అల్లాడిపోయిన ప్రజలు చిరు జల్లులతో కూడిన వర్షం కురవడంతో కొంత ఊరట చెందారు. మృగశిరకార్తె కావడంతో దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ములలో చేపలు, మాంసం విక్రయాలకు డిమాండ్ పెరిగింది. చేపలు కిలో రూ.200 నుంచి 400 వరకు బొచ్చెలు, బురదమట్టలు, తదితర రకాల చేపలను విక్రయించారు. నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీతోపాటు మండలంలోని వివిధ చెరువులలో పట్టిన చేపలను మత్స్యకారులు విక్రయాలు నిర్వహించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం చేపలు, మాంసం గిరాకీ పెరిగిందని వ్యాపారులతోపాటు మత్స్యకారులు తెలుపుతున్నారు. దేవరకొండ డివిజన్‌లో ఇప్పటికే దుక్కులు దున్నుకొని విత్తనాలు వే సేందుకు సిద్ధంగా ఉన్న రైతులు భారీ వర్షం కురిస్తే విత్తనాలు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మృగశిరకార్తె ప్రారంభంరోజే వర్షం కురుస్తుండ డంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వీ.టీ.నగర్‌లో చేపల కోసం బారులు తీరిన ప్రజలు

జోరుగా చేపల విక్రయాలు

కొండమల్లేపల్లి : కొండ మల్లే పల్లి మండల కేంద్రంలో మృగశిర కార్తె సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో వద్ద చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబర్చారు. మృగశిరకార్తె రోజున చేపలు తినాలి అనేనానుడి ఉండడంతో పెద్ద సంఖ్య లో చేపలు కొనుగోలు చేశారు.

చేపల కోసం బారులు...

చింతపల్లి : మండల కేంద్రంతో పాటు వేంకటేశ్వరనగర్(మాల్)లో ప్రజలు చేపల కోసం ఆదివారం సాయింత్రం బారులు తీరారు. చేప మందు తినలానే నమ్మకంతో పట్టణంలో ప్రజలు ఒక్కసారిగా చేపల కొనుగోలు కోసం హైవేపై బారులు తీరారు. దీంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొన్నది.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

● కల్వకుర్తి రోడ్డుపై ఎంకేఆర్ కళాశాలకు వెళ్లే ఆర్చి మలుపు వద్ద తరచూ ప్రమాదాలు

దేవరకొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీ పరిధిలోని కల్వకుర్తి రోడ్డు ఎంకేఆర్ కళాశాలకు వెళ్లే జాతీయ రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి కావడంతో వాహనాలు వేగంగా వస్తుండడంతో తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈనెల 7న రాత్రి నేనావత్ హరి అనే యువకుడు బైక్‌పై రోడ్డు మలుపు వద్దకు రాగానే కల్వకుర్తి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గతేడాది ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి భీమానాయక్ బైక్‌పై ఇదే మలుపు వద్ద కళాశాలకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు ఎంకేఆర్ కళాశాలకు వెళ్లే దారి మలుపు వద్ద తరచు జరుగుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది. రహదారిపై సిగ్నల్ పాయింట్‌తోపాటు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దేవరకొండ ఎంకేఆర్ కళాశాలకు వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రమాదాల నివారణకు చర్యలు

మున్సిపల్, నేషనల్ హైవే అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రమాదాలు జరిగే ప్రాంతంలో సిగ్నల్స్ పాయింట్, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే మున్సిపల్ అధికారులకు తెలియజేయడం జరిగింది. సిగ్నల్స్ పాయింట్ ఏర్పాటు చేయాలి.
-నర్సింహులు, సీఐ, దేవరకొండ

జోరుగా వర్షం..అన్నదాతల హర్షం



జలమయంగా మారిన మాల్ బస్టాండ్

చింతపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకటేశ్వర నగర్(మాల్), గొడకొండ్ల, మదనాపురంలో తక్కళ్లపల్లి, పోలేపల్లిరాంనగర్‌లో తదితర గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం జోరుగా వర్షం కురిసింది. దీం తో పాటు మృగశిరకార్తె రావడంతో పాటు వర్షం గంట పాటు భారీగా కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలు సకాలంలో కురిస్తే పంట దిగుబడులు సాధించవచ్చని ఆశభావం వ్యక్తం చేశారు.

దళిత బహుజనుల భాగస్వామ్యంపైహర్షం

కొండమల్లేపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వంలో దళిత బహుజనుల భాగస్వామ్యం కావడం పట్ల కాంగ్రెస్ కొండమల్లేపల్లి మండలాధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశు. రాష్ట్ర మంత్రి వర్గంలో దళితుల నుంచి వెంకట్‌స్వామి, అడ్లూరి లక్ష్మణ్, బహుజన వర్గం నుంచి వాకిటి శ్రీహరికి ఈ స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.